

సుంకరమెట్ట జంక్షన్‌లోని ఆలయంలో సూర్యనారాయణస్వామి

పాఠశాల విద్య ప్రక్షాళన

పలు మార్పులకు కూటమి ప్రభుత్వం శ్రీకారం

- గత వైసీపీ ప్రభుత్వం అమలు చేసిన జీవో 117లో సవరణలు
- ఎంపీపీ పాఠశాలల్లో 60 మందికన్నా ఎక్కువ పిల్లలు ఉంటే మోడల్ ప్రైమరీ స్కూల్స్‌గా మార్పు
- తక్కువ మంది విద్యార్థులు ఉన్న 28 ప్రాథమికోన్నత పాఠశాలలు ఎత్తివేసే ప్రతిపాదన



అనకాపల్లి మండలం సుందరయ్యపేటలో ప్రాథమికోన్నత పాఠశాల

- 13 ప్రాథమికోన్నత పాఠశాలలు హైస్కూళ్లుగా అప్‌గ్రేడ్
- వచ్చే విద్యా సంవత్సరం నుంచి అమలు
- క్షేత్రస్థాయిలో వివరాల సేకరణలో విద్యా శాఖ

(అనకాపల్లి-ఆంధ్రజ్యోతి)

విద్యా శాఖలో సూమూల మార్పులకు కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ముఖ్యంగా ప్రాథమిక విద్యకు సంబంధించి కొత్తగా మోడల్ ప్రైమరీ స్కూల్స్ ఏర్పాటు కానున్నాయి. వైసీపీ హయాంలో ఉన్నత పాఠశాలల్లో విలీనం చేసిన మూడు తరగతులను తిరిగి ఈ మోడల్ పాఠశాలల్లోకి చేరుస్తారు. ఈ క్రమంలో కొన్ని ప్రాథమికోన్నత పాఠశాలలను ఎత్తివేస్తారు.

గత ఐదేళ్ల వైసీపీ పాలనలో విద్యా వ్యవస్థ అస్తవ్యస్తంగా తయారైంది. నూతన విద్యా విధానం పేరుతో ప్రాథమిక పాఠశాలలను నిర్వీర్యం చేశారు. ఉన్నత పాఠశాలలకు కిలోమీటరు పరిధిలో వున్న ప్రాథమిక పాఠశాలల్లో ఒకటి, రెండు తరగతులను మాత్రమే వుంచారు., మిగిలిన మూడు తరగతులను ఉన్నత పాఠశాలల్లో విలీనం చేశారు. ఇటువంటి ప్రాథమిక పాఠశాలల్లో పట్టుమని పది మంది విద్యార్థులు కూడా లేరు. ఈ నేపథ్యంలో గత ఏడాది అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం విద్యా వ్యవస్థను గాడిలో పెట్టడానికి చర్యలు చేపట్టింది. మానవ వనరుల శాఖా మంత్రి నారా లోకేశ్ పాఠశాల విద్యలో అనేక మార్పులకు శ్రీకారం చుడుతున్నారు. వైసీపీ ప్రభుత్వం అమలు చేసిన 117 జీవో వల్ల ఎదురైన ఇబ్బందులను తొలగించేందుకు పలు సంస్కరణల అమలుకు ముమ్మరంగా కసరత్తు జరుగుతున్నది. గత ప్రభుత్వం హయంలో ఉన్నత పాఠశాలల్లో విలీనం చేసిన 3, 4, 5 తరగతులను తిరిగి మాతృ పాఠశాలలకు తీసుకురానున్నారు. ఇదే సమయంలో 60 మందికన్నా ఎక్కువ విద్యార్థులు ఉన్న ప్రాథమిక పాఠశాలలను మోడల్ ప్రైమరీ స్కూళ్లగా తీర్చి దిద్దనున్నారు. జిల్లా విద్యా శాఖాధికారులకు అందిన నివేదికల ప్రకారం జిల్లాలో 64 ప్రాథమిక పాఠశాలల్లో 60 మందికిపైగా విద్యార్థులు ఉన్నారు. ఈ పాఠశాలలను మోడల్ ప్రైమరీ స్కూళ్లగా మారుస్తారు. ప్రతి మోడల్ ప్రైమరీ స్కూల్‌లో కనీసం ఐదుగురు ఉపాధ్యాయులు ఉండేలా సర్దుబాటు చేస్తారు. ఇదే సమయంలో గత వైసీపీ ప్రభుత్వం 117 జీవో ఆధారంగా చేపట్టిన పాఠశాలల విలీన ప్రక్రియలో భాగంగా 153 హైస్కూళ్లలో కలిపేసిన 3, 4, 5 తరగతుల విద్యార్థులను సమీపంలో కొత్తగా ఏర్పాటు కానున్న ప్రైమరీ మోడల్ స్కూల్స్‌లో చేరుస్తారు. ప్రభుత్వం అమలు చేయనున్న విద్యా సంస్కరణలతో జిల్లాలో 28 ప్రాథమికోన్నత పాఠశాలలు కొనసాగే అవకాశం లేదని అధికారులు చెబుతున్నారు. ప్రాథమికోన్నత పాఠశాలల్లో 6, 7, 8 తరగతులు చదువుతున్న విద్యార్థులు 60 మందికంటే ఎక్కువ ఉంటే మూడు కిలోమీటర్ల పరిధిలోవున్న ఉన్నత పాఠశాలలో విలీనం చేస్తారు. మిగిలిన ఐదు తరగతులతో ప్రాథమిక పాఠశాలగా కొనసాగిస్తారు. ఒకవేళ మూడు కిలోమీటర్ల పరిధిలో ఉన్నత పాఠశాల లేకపోతే.. ప్రాథమికోన్నత పాఠశాలలను ఉన్నత పాఠశాలలుగా అప్‌గ్రేడ్ చేస్తారు. జిల్లాలో 13 ప్రాథమికోన్నత పాఠశాలలను హైస్కూళ్లగా అప్‌గ్రేడ్ చేసే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు. ఈ ప్రక్రియ మొత్తం వచ్చే విద్యా సంవత్సరం ఆరంభం నాటికి పూర్తిచేయడానికి క్షేత్రస్థాయిలో వివరాలు సేకరిస్తున్నారు. కాగా ప్రతి శనివారం 'నో బ్యాగ్ డే' అమలు చేయాలని భావిస్తున్నారు.

జీవో 117ను పూర్తిగా రద్దు చేయాలి



విద్యా వ్యవస్థను చక్కదిద్దేకు కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టడం మంచిదే. కానీ ముందుగా జీవో 117ను రద్దు చేయాలి. గతంలో ఉన్నత పాఠశాలల్లో విలీనం చేసిన 3, 4, 5 తరతులను తిరిగి ప్రాథమిక పాఠశాలలకు తీసుకురానున్నట్టు మాత్రమే మార్గదర్శకాల్లో పేర్కొన్నారు. జీవో 117లో పేర్కొన్న ఉపాధ్యాయుడు, విద్యార్థుల నిష్పత్తి విధానాన్ని రద్దు చేయాలి. ప్రాథమిక పాఠశాలల్లో ప్రతి తరగతికి ఒక టీచర్ ఉండాలి.

గొంది చినబ్బాయ్, యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి

భక్తి శ్రద్ధలతో రథసప్తమి వేడుకలు

సుంకరమెట్ట, రాజుపాలెం ఆలయాలు భక్తులతో కిటకిట

రథ సప్తమి వేడుకలను మంగళవారం భక్తి శ్రద్ధలతో ఘనంగా జరుపుకున్నారు. అనకాపల్లి పట్టణంలోని సుంకరమెట్ట జంక్షన్ వద్ద వున్న సూర్యనారాయణస్వామి ఆలయం, అనకాపల్లి మండలం రాజుపాలెంలోని సూర్యనారాయణమూర్తి ఆలయాలకు భక్తులు పోటెత్తారు. స్వామి వారి దర్శనం కోసం తెల్లవారుజామునే ఆలయాల వద్ద బారులు తీరారు. ప్రత్యేక పూజల అనంతరం భక్తులకు దర్శనాలు ప్రారంభించారు. పలువురు ప్రముఖులు ఆలయాలకు వచ్చి స్వామివారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు.

మరో ఫెర్రో పరిశ్రమ మూత?

విద్యుత్ బకాయిలు చెల్లించని రాజరాజేశ్వరి లలితా త్రిపుర సుందరి అల్లాయిస్ కంపెనీ

- గత నెల 23 నుంచి విద్యుత్ సరఫరా నిలిపివేత
- ఆగిపోయిన ఉత్పత్తి
- ముడి సరకు తరలింపునకు యాజమాన్యం చర్యలు
- పసిగట్టి.. ఆందోళనకు దిగిన కార్మికులు



రాజరాజేశ్వరి లలితా త్రిపుర సుందరి ఫెర్రో పరిశ్రమ

అచ్యుతాపురం, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి):

ప్రత్యేక ఆర్థిక మండలి (ఎస్‌ఈజడ్)లో మరో ఫెర్రో కర్మాగారం మూసివేత దిశగా అడుగులు వేస్తున్నది. ఫ్యాక్టరీని గుట్టు చప్పుడు కాకుండా మూసేయాలని యాజమాన్యం ప్రయత్నాలు చేసింది. అయితే కార్మికులు ఈ విషయాన్ని పసిగట్టి, వాహనాలను అడ్డుకోవడంతో వెలుగులోకి వచ్చింది. వివరాల్లోకి వెళితే..



సరకును తీసుకెళ్లడానికి వచ్చిన కంటైనర్లు

అచ్యుతాపురం ప్రత్యేక ఆర్థిక మండలిలో రాజరాజేశ్వరి లలితా త్రిపుర సుందరి ఫెర్రో అల్లాయిస్ ప్రైవేట్ లిమిటెడ్ కర్మాగారం ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోయింది. ఇందులో సుమారు 550 ఉద్యోగులు, కార్మికులు పనిచేస్తున్నారు. విద్యుత్ బకాయిలు పేరుకుపోవడంతో గత జనవరి 23వ తేదీ నుంచి కర్మాగారానికి విద్యుత్ సరఫరాను ఈపీడీసీఎల్ అధికారులు నిలిపివేశారు. అప్పటి నుంచి ఉత్పత్తి నిలిచిపోయింది. విద్యుత్ బకాయిలు చెల్లించి కర్మాగారంలో ఉత్పత్తిని పునఃప్రారంభిస్తామని యాజమాన్యం చెప్పింది. అయితే ఉన్నత ఉద్యోగాల్లో ఉన్న వారికి వాస్తవ పరిస్థితులు తెలియడంతో ఇక్కడ ఉద్యోగం మానేసి వేరే కర్మాగారాలకు వెళ్లిపోతున్నారు. మరోవైపు యాజమాన్యం కర్మాగారంలో కొంత ముడిసరకుతోపాటు ఉత్పత్తి చేసిన సరకును కంటైనర్లతో బయటకు పంపించేస్తున్నారు. యాజమాన్యం ఆంతర్యాన్ని కార్మికులు, కిందస్థాయి ఉద్యోగులు గుర్తించలేకపోయారు. కర్మాగారం పరిస్థితి ఎలా వుందో తెలుసుకోవడానికి మంగళవారం ఉదయం కొంతమంది కార్మికులు ఇక్కడకు వచ్చారు. పెద్ద సంఖ్యలో కంటైనర్లు కర్మాగారం వద్ద కనిపించడంతో ఇతర కార్మికులకు, ఉద్యోగులకు ఫోన్‌ల ద్వారా సమాచారం అందించారు. సాయంత్రానికి పెద్ద సంఖ్యలో కార్మికులు ఇక్కడకు చేరుకొని కంటైనర్లు కర్మాగారంలోకి వెళ్లకుండా అడ్డుకున్నారు. తమకు నాలుగు నెలల జీతాలు ఇవ్వాల్సి వుందని ... మిగతా 8వ పేజీలో

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానానికి

ముగ్గురి నామినేషన్

- రెండు సెట్లు దాఖలు చేసిన సిట్టింగ్ ఎమ్మెల్సీ పాకలపాటి రఘువర్మ



రిటర్నింగ్ అధికారి, విశాఖపట్నం జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్‌కు నామినేషన్ పత్రాలు అందజేస్తున్న సిట్టింగ్ ఎమ్మెల్సీ పాకలపాటి రఘువర్మ

విశాఖపట్నం, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి):

ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానానికి మంగళవారం ముగ్గురు నామినేషన్లు దాఖలు చేశారు. సిట్టింగ్ ఎమ్మెల్సీ పాకలపాటి రఘువర్మ రెండు సెట్లు, మాజీ ఎంఈవో ఎస్.ఆర్.పద్మావతి, సెయింట్ జోసెఫ్ కళాశాల రిటైర్డు ఆచార్యుడు కోసూరు రాధాకృష్ణ ఒక్కొక్క సెట్ నామినేషన్ పత్రాలను ... మిగతా 8వ పేజీలో

రఘువర్మకే కూటమి మద్దతు

- ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవిరావు
- గతపాలకుల నిర్లక్ష్యంతో గాడి తప్పిన విద్యా వ్యవస్థ: రఘువర్మ

-8లో

నర్సీపట్నంలో కలకలం

డీసీసీబీ బ్రాంచిలోకి పెట్రోల్ క్యాన్‌తో ప్రవేశించిన జానకిరామపురం సీపీసీఎస్ సీఈవో

- భవనం వెనుక గేటుకు తాళాలు
- పెట్రోల్ క్యాన్‌తో బీఎం ఛాంబర్‌లోకి వెళ్లిన సీఈవో
- సిబ్బంది అడ్డుకుని.. పెట్రోల్ క్యాన్ లాగివేత
- పోలీసులకు ఫిర్యాదు చేసిన బ్రాంచి మేనేజర్



జానకిరామపురం పీఏసీఎస్ సీఈవో రామకృష్ణ నుంచి పెట్రోల్ క్యాన్‌ను లాక్కుంటున్న డీసీసీబీ సిబ్బంది

నర్సీపట్నం, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి):

రోలుగుంట మండలం జానకిరామపురం ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (పీఏసీఎస్) సీఈవో రామకృష్ణ పెట్రోల్ క్యాన్‌లతో డీసీసీబీ నర్సీపట్నం బ్రాంచ్‌లోకి ప్రవేశించడం కలకలం సృష్టించింది. బ్యాంకు సిబ్బంది తీవ్ర భయ భ్రాంతులకు గురయ్యారు. దీనికి సంబంధించి బ్యాంకు మేనేజర్ నాయుడు తెలిపిన వివరాలిలా వున్నాయి.

జానకిరామపురం సొసైటీ సీఈవో రామకృష్ణ, గుమస్తా దేవుడు, మరో ఇద్దరు యువకులు మంగళవారం ఉదయం నర్సీపట్నంలోని డీసీసీబీ బ్రాంచ్‌లోకి ప్రవేశించారు. సిబ్బంది ఎవరూ బయటకు వెళ్లకుండా వెనక భాగంలోని ఇనుప గేటుకి చైన్ చుట్టి తాళాలు వేశారు. వెంటతెచ్చిన పెట్రోల్ క్యాన్‌తో రామకృష్ణ నేరుగా మేనేజర్ ఛాంబర్‌లోకి ప్రవేశించాడు. దీంతో భయాందోళనకు గురైన సిబ్బంది.. అతని చేతిలోని పెట్రోల్ క్యాన్‌ను లాక్కున్నారు. అనంతరం మేనేజర్ నాయుడు పోలీసులకు ఫిర్యాదు చేశారు. జానకిరామపురం సొసైటీ సీఈవో రామకృష్ణ పెట్రోల్ పోసి బ్రాంచ్‌కి నిప్పు పెట్టడానికి వచ్చాడని ఫిర్యాదులో పేర్కొన్నారు. సీఐ గోవిందరావు వచ్చి బ్యాంకులో విచారణ చేశారు. మేనేజర్, సిబ్బంది నుంచి వివరాలు సేకరించారు. సీసీ ఫుటేజీలు పరిశీలించారు. ఈ సంఘటనపై సీఐ గోవింరావును 'ఆంధ్రజ్యోతి' వివరణ కోరగా.. తనకు జీతం ఇవ్వడంలేదని, ఆత్మహత్య చేసుకుందామని పెట్రోల్ క్యాన్‌లతో బ్యాంకుకు వచ్చినట్టు జానకిరామపురం సొసైటీ సీఈవో రామకృష్ణ చెప్పాడన్నారు. కేసు నమోదు చేసి విచారణ చేస్తామని అన్నారు.

సీఈవోపై అవినీతి ఆరోపణలు

జానకిరామపురం పీఏసీఎస్ సీఈవో రామకృష్ణ అధికార దుర్వినియోగానికి పాల్పడ్డారని, సొంత అవసరాలకు బ్యాంకు డబ్బులు వాడుకున్నారని ఆరోపణలు ఉన్నాయి. పీఏసీఎస్‌లో జరిగిన అవకతవకలపై గత ఏడాది జూలై 22 తేదీన 'ఆంధ్రజ్యోతి'లో కథనం వచ్చింది. దీనిపై అధికారులు విచారణ జరిపి అవకతవకలు వాస్తవమేనని తేల్చారు. సీఈవో రామకృష్ణ నుంచి రూ.16 లక్షలు రికవరీ చేసి, అతనిని సస్పెండ్ చేయాలని సబ్ డివిజనల్ అసిస్టెంట్ రిజిస్ట్రార్ ఐవీ రమణమూర్తి జిల్లా సహకార శాఖ అధికారికి నివేదిక ఇచ్చారు. ఆయనపై ఇంతవరకు ఎటువంటి చర్యలు తీసుకోలేదు.

స్టాఫ్ సెలక్షన్ కమిషన్ పరీక్షలో మణి కిరణ్‌కు నాలుగో ర్యాంకు

- జాతీయ స్థాయిలో సత్తాచాటిన కొండపాలెం విద్యార్థి
- సీపీడబ్ల్యూడీలో జేఈ పోస్టుకు ఎంపిక



కుమారుడికి మిఠాయి తినిపిస్తున్న తల్లిదండ్రులు అర్జున, విజయలక్ష్మి

రోలుగుంట, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి):

మండలంలోని కొండపాలేనికి చెందిన గాలి వినాయక మణి కిరణ్ స్టాఫ్ సెలక్షన్ కమిషన్ (ఎస్ఎస్‌సీ) నిర్వహించిన పరీక్షలో అఖిల భారత స్థాయిలో నాలుగో ర్యాంకు సాధించాడు. సెంట్రల్ పబ్లిక్ వర్క్స్ డిపార్ట్‌మెంట్ (సీపీడబ్ల్యూడీ)లో జేఈ పోస్టుల భర్తీకి స్టాఫ్ సెలక్షన్ కమిషన్ గత ఏడాది నవంబరులో పరీక్ష నిర్వహించింది. మంగళవారం ఫలితాలను విడుదల చేసింది. మణి కిరణ్ ఆలిండియా 4వ ర్యాంకు సాధించాడు. కిరణ్‌ది సన్నకారు రైతు కుటుంబం. తల్లిదండ్రులు అర్జున, విజయలక్ష్మి కొద్దిపాటి పొలాన్ని సాగుచేసుకుంటూ కూలి పనులకు వెళుతుంటారు. మణి కిరణ్ 10వ తరగతి వరకు రోలుగుంట జడ్పీ ఉన్నత పాఠశాలలో చదివాడు, విజయనగరంలో పాలిటెక్నిక్ పూర్తి చేసి ప్రస్తుతం శ్రీకాకుళంలో బీటెక్ చదువుతున్నాడు. కుమారుడికి మంచి ఉద్యోగం రావడంతో తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేశారు.

హెటెరోలో విషవాయువులు లీక్

12 మందికి అస్వస్థత

- ముగ్గురు విశాఖ తరలింపు
- అస్వస్థతకు గురైన వారంతా కెమిస్ట్‌లే



నక్కపల్లి సీహెచ్‌సీలో చికిత్స పొందుతున్న కెమిస్ట్

... వార్త మెయిన్‌లో

పంచాయతీల్లో పారదర్శకత

త్వరలో అందుబాటులోకి డిజిటల్ సేవలు

- స్వర్ణ పంచాయతీ' పేరుతో వెబ్‌సైట్
- ఇళ్ల పన్నులు సహా అన్నిరకాల చెల్లింపులు ఆన్‌లైన్‌లోనే!
- అవినీతి, అక్రమాలు, నిధుల దుర్వినియోగానికి అడ్డుకట్ట



గ్రామ సచివాలయం

కోటవురట్ల, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి):

గ్రామ పంచాయతీల్లో వివిధ రకాల పన్నుల వసూళ్లు, ఇతర ఆదాయాలకు సంబంధించి అక్రమాలకు చెక్ పెట్టేందుకు కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. 'స్వర్ణ పంచాయతీ' పేరుతో కొత్తగా వెబ్‌సైట్‌ను రూపొందించి సంబంధిత పంచాయతీకి ఆన్‌లైన్‌లో పన్నుల చెల్లింపునకు శ్రీకారం చుట్టింది. పంచాయతీకి సంబంధించి అన్ని చెల్లింపులు ఆన్‌లైన్‌లో నిర్వహించేలా డిజిటలైజేషన్ చేస్తున్నది. దీంతో పంచాయతీల పాలనలో పారదర్శకత, జవాబుదారితనం పెరగనున్నది.

గ్రామ పంచాయతీలకు ప్రభుత్వాలు ఇచ్చే ఆర్థిక సంఘాల నిధులు కాకుండా ఇళ్ల పన్నులే ప్రధాన ఆదాయ వనరు. వీటిని సాధారణ నిధులు అని కూడా అంటారు. ఇంకా దుకాణాల ఫీజులు, సంతల ఆశీలు, చెరువులు లీజు, సెల్ టవర్ల ఫీజు, పరిశ్రమల నుంచి ఆస్తి పన్ను వంటివి వస్తుంటాయి. పంచాయతీ సిబ్బంది ఇంతవరకు వీటిని నగదు రూపంలో నేరుగా ఆయా వ్యక్తులు ... మిగతా 8వ పేజీలో

పెంటకోట రేషన్ డీలర్‌పై 6ఎ కేసు

పాయకరావుపేట రూరల్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి) : మండలంలో పెంటకోట రేషన్ షాపును మంగళవారం సీఎస్‌డీటీ సూర్య ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులో కంటే తక్కువ బియ్యం ఉండడాన్ని గుర్తించి రేషన్ డీలర్‌పై 6ఎ కేసు నమోదుచేశారు. రికార్డులో కంటే 170 కేజీల బియ్యం తక్కువగా ఉన్నట్టు గుర్తించామన్నారు. ఇందుకు సంబంధించి రేషన్ డీలర్ ఎ.శివకృష్ణపై 6ఎ కేసు నమోదు చేశామన్నారు. రేషన్ డిపోను పక్క డిపోకి అప్పగించామని ఆయన తెలిపారు.

ప్రశాంతి విద్యార్థికి ఎన్‌సీసీ అవార్డు

అచ్యుతాపురం, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): తమ కళాశాలలో డిప్లొమా తృతీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థి గంగిరి దుర్గాప్రసాద్‌కి డీజీ ఎన్‌సీసీ కమెండేషన్ అవార్డు వచ్చిందని ప్రశాంతి విద్యాసంస్థల ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు తెలిపారు. సికింద్రాబాదులో డిప్యూటీ డైరెక్టర్ ఎయిర్ కమాండర్ వీఎం రెడ్డి అవార్డుని అందజేశారని ఆయన తెలిపారు. దుర్గాప్రసాద్‌కి అవార్డు వచ్చినందుకు ప్రశాంతి విద్యా సంస్థల చైర్మన్ ధర్మిరెడ్డి ప్రసాద్, అధ్యాపక బృందం, విద్యార్థులు అభినందించారు.

'భూ రీసర్వేతో సమస్యలకు చెక్'

మునగపాక, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): రైతులు ఎదుర్కొంటున్న సమస్యలకు చెక్ పెట్టేందుకు భూముల రీ సర్వే చేస్తున్నామని స్థానిక తహసీల్దార్ ఆది ఉమామహేశ్వరరావు అన్నారు. మండలంలో నరేంద్రపురం, తదితర గ్రామాల్లో మంగళవారం భూ రీసర్వే కార్యక్రమం జరిగింది. సర్వేయర్లు, వీఆర్వోలు క్షేత్రస్థాయిలో సర్వే నిర్వహించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ బోసా వెంకటలక్ష్మి, శ్రీనివాసరావు, వెంకన్న, డీటీ, సిబ్బంది పాల్గొన్నారు.

ధర్మనిధి సభ్యత్వ నమోదు ప్రారంభం

అచ్యుతాపురం, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): ధర్మనిధి సభ్యత్వాన్ని ప్రారంభిస్తున్నామని సమరసత సేవా ఫౌండేషన్ ఎలమంచిలి సబ్ డివిజన్ కన్వీనర్ బీవీ రమణ తెలిపారు. మంగళవారం కొండకర్ల రామాలయంలో జరిగిన మండల సమావేశంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో 500 మండలాల్లో ధర్మప్రచారకులు, కన్వీనర్లను ఏర్పాటుచేసి శిక్షణ ఇస్తామన్నారు. వీరు ఇంటింటికి వెళ్లి ధర్మప్రచారం చేయడంతోపాటు ధర్మాన్ని విడిచి వెళ్లిన వారికి స్వధర్మం ఆచరించాలని బోధిస్తారన్నారు. కార్యక్రమంలో కొల్లి అప్పారావు, గుడివాడ రమణ, బంటు రాము, కంఠంరెడ్డి సన్యాసిరావు తదితరులు పాల్గొన్నారు.

హాకీ క్రీడాకారులకు బంతులు పంపిణీ

ఎలమంచిలి, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): నక్కపల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఫిజికల్ డైరెక్టర్ కొరారు దుర్గారావు ఎలమంచిలి హాకీ క్రీడాకారులకు బంతులను వితరణగా అందజేశారు. మంగళవారం క్రీడా మైదానంలో 60 మంది క్రీడాకారులకు వ్యక్తిగతంగా క్రీడా బంతులు పంపిణీ చేశారు. అలాగే నక్కపల్లిలోని 50 మంది క్రీడాకారులకు బంతులను పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ క్రీడాకారులు పాల్గొన్నారు.

స్కౌట్స్‌తో దేశభక్తి, క్రమశిక్షణ

నక్కపల్లి, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): విద్యార్థి దశ నుంచే స్కౌట్స్ అండ్ గైడ్స్‌లో పిల్లలు చేరడం వల్ల అత్యుత్తమ క్రమశిక్షణ, దేశభక్తి, సమాజం పట్ల బాధ్యత ఏర్పడుతుందని ఉద్దండపురం జడ్పీ హైస్కూల్ హెచ్‌ఎం డి. సత్యారావు చెప్పారు. మండలంలోని మంగళవారం స్కౌట్స్ అండ్ గైడ్స్ విద్యార్థుల సమ్మేళనంలో ఆయన మాట్లాడారు. స్కౌట్స్ అండ్ గైడ్స్ జిల్లా ప్రతినిధి కొణతాల రత్నకుమారి, సోనీ ,శేఖర్,హరిత కుమారి పాల్గొన్నారు.

జగన్‌ని కలిసిన ఎంపీపీ గోవింద్

ఎలమంచిలి, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిని మంగళవారం తాడేపల్లిలోని కార్యాలయంలో మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్‌తో కలిసి ఎంపీపీ బోదెపు గోవింద్ కలిశారు. ఈ సందర్భంగా స్థానిక సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లినట్టు గోవింద్ తెలిపారు. నిత్యం ప్రజల మధ్యే ఉంటూ వారి సమస్యల పరిష్కారం కోసం శ్రమించాలని జగన్ సూచించారని ఎంపీపీ తెలిపారు.

ఘనంగా పరదేశమ్మ పండుగ

ఎలమంచిలి, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): మునిసిపాలిటీ పరిధిలోని పెదగొల్లలపాలెంలో మంగళవారం పరదేశమ్మ పండుగ ఘనంగా జరిగింది. ఉదయం నుంచి అమ్మవారిని భక్తులు దర్శించుకొని పూజలు చేశారు. ఈ సందర్భంగా మొక్కులు చెల్లించుకున్నారు. మహిళా భక్తులంతా తమ ఇళ్ల నుంచి సారెను ఊరేగింపుగా ఆలయానికి తీసుకెళ్లి పూజలు నిర్వహించారు. ఆలయ ఆవరణలో భజనలు నిర్వహించారు.

'తాండవ కాలువ మరమ్మతులకు కృషి'

కోటవురట్ల, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తాండవ కాలువ చివరి భూములకు సాగునీరు అందడం లేదు. ఈ నేపథ్యంలో సాగునీటి కాలువ చైర్మన్లు, డిస్ట్రిబ్యూటర్ ఉపాధ్యక్షులు పల్లెల నాగేశ్వరరావు, చిటికెల సత్యనారాయణ, డైరెక్టర్లు బత్తుల రాంబాబు, జోగి నమ్మిరాజు, అప్పలనాయుడు మంగళవారం లింగాపురం, కోటవురట్ల, రాట్నాలపాలెం, కైలాసపట్నం వరకు ఉన్న కాలువను పరిశీలించారు. అనంతరం వారు మాట్లాడుతూ తాండవ కాలువ పూర్తిగా పూడిక పేరుకుపోయిందన్నారు. తుప్పలు పెరిగిపోయాయన్నారు. బుధవారం జరగనున్న తాండవ ప్రాజెక్టు సమావేశంలో కాలువల మరమ్మతుల కోసం నిధులు మంజూరుకు కృషిచేస్తామన్నారు. వచ్చే ఖరీఫ్‌లో కాలువ ద్వారా చివరి భూములకు సాగునీరు వచ్చేలా చర్యలు తీసుకుంటామన్నారు.

ఘనంగా రథసప్తమి వేడుకలు

అచ్యుతాపురం, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): రథసప్తమి సందర్భంగా నునపర్తి హరిహర పంచాయతన క్షేత్రం (సిద్ధాశ్రమం)లో మంగళవారం ఆదిత్యుని కల్యాణం అంగరంగ వైభవంగా జరిగింది. మంగళవారం ఉదయం నుంచి ఆధ్యాత్మిక కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. పండితుల సూర్యనమస్కారాల అనంతరం సూర్య మంటపం వేసి అందులో మొలకెత్తిన పెసలు, చిలకడ దుంప ముక్కలు, రేగుపళ్లు భక్తులచే నైవేద్యం పెట్టించారు. అనంతరం సౌర్య హోమం తర్వాత ఉషా, ఛాయా, పద్మిని సమేత ఆదిత్యుని కల్యాణాన్ని కన్నుల పండువగా చేశారు. వేద పండితులు గండికోట వెంకట బ్రహ్మ శ్రీనివాస శర్మ, దిగుడాడి రుద్రయ్య హోమాది క్రతువులు చేయించారు. మంగళవారం సాయంత్రం తిరువీధి, చక్రస్నానం అనంతరం ప్రసాద వితరణ జరిపారు. కార్యక్రమాల్లో బొజ్జ అప్పారావు, రెడ్డి నర్సింగరావు, గొంప నరసింహనాయుడు, తెడ్లపు సత్యనారాయణ, చీపురుపల్లి దేముడు, కూండ్రపు నర్సింహమూర్తి, సీహెచ్ కన్నాజీ, ములుకూరి రమణాజీ పాల్గొన్నారు.

ఎలమంచిలిలో..

స్థానిక గొల్లల కొండపై మంగళవారం రథసప్తమి వేడుకలు ఘనంగా జరిగాయి. సూర్యనారాయణ స్వామి వారిని తెల్లవారుజాము నుంచి భక్తులు దర్శించుకున్నారు. స్వామివారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలతోపాటు పాలాభిషేకాలు నిర్వహించారు. అనంతరం ప్రసాద వితరణ చేపట్టారు. సాయంత్రం ఆలయ ఆవరణలో ప్రత్యేక భజనలు, కీర్తనలు ఆలపించారు.

పాయకరావుపేట రూరల్‌లో..

మండలంలో పలు గ్రామాలలో మంగళవారం రథసప్తమిని ఘనంగా జరుపుకున్నారు. గోపాలపట్నం సమీపంలోని సీతమ్మవారి కొండపై జరిగిన రథ సప్తమి వేడుకల్లో పాయకరావుపేట, నక్కపల్లి మండలాల నుంచి భారీ సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. భక్తులు పిడకలతో మంటను ఏర్పాటు చేసి పాలు పొంగించి పూజలు నిర్వహించారు. ఉమాధర్మలింగేశ్వర స్వామిని ఉత్తరాయణ పుణ్య కాలమంతా సూర్యకిరణాలు తాకుతాయని పెద్దలు, ఆలయ కమిటీ నిర్వాహకులు చెబుతారు. బీజేపీ నాయకులు రత్నభరత్, ఆచంట శ్రీకాంత్, వేముల వెంకటేశ్వరరావు, కలిగట్ల మూలాస్వామి తదితరులు స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు రత్నభరత్‌ను సత్కరించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు పెద్దిరాజు, శివాజీరాజు పాల్గొన్నారు.

పాయకరావుపేటలో..

రథసప్తమిని పట్టణ ప్రజలు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. స్థానిక పాండురంగస్వామి ఆలయంలో ఆలయ ప్రధానార్చకులు యి.కృష్ణస్వామి ఆధ్వర్యంలో స్వామి, అమ్మవార్లకు విశేష పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామిని దర్శించుకున్నారు. అనంతరం ఆలయ ఆవరణలో రథసప్తమి ప్రత్యేక పూజా కార్యక్రమంలో దేవస్థానం మాజీ చైర్మన్ యాళ్ల వరహాలబాబు, ఆలయ ఈఓ కె. దివ్యతేజ, అర్చకులు యి.నారాయణస్వామి, నాయకులు వీసం మహేష్, జగన్నాథం, కర్ర శ్రీను, జగతా శ్రీను, రాజాన ఆది పాల్గొన్నారు. అదేవిధంగా పట్టణంలో రాజుగారి బీడులోని వేంకటేశ్వరస్వామి, బృందావనంలోని దుర్గాలమ్మ చెట్టు, సుబ్రహ్మణ్యస్వామి, సాయి ఆదర్శనగర్‌లోని షిర్డీ సాయి ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి.

నక్కపల్లిలో..

మండలంలోని పలు గ్రామాల్లో మంగళవారం రథసప్తమి వేడుకలు ఘనంగా జరిగాయి. అనేక మంది భక్తులు తమ ఇళ్లల్లో రథసప్తమి పూజలను జరుపుకున్నారు. నక్కపల్లి, వేంపాడు, ఉపమాక, ఉద్దండపురం, జానకయ్యపేట తదితర గ్రామాల్లో అనేక మంది భక్తులు సూర్య నమస్కారాలు చేసి తమ భక్తి ప్రపత్తులు చాటుకున్నారు.

ఎస్.రాయవరంలో..

మండలంలోని అన్ని గ్రామాల్లో మంగళవారం రథసప్తమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. రథసప్తమిను పురస్కరించుకొని పెదఉప్పలం తదితర గ్రామాల్లో గల భక్తులందరూ సూర్యనారాయణమూర్తికి పూజలు చేశారు.


అచ్యుతాపురం: నునపర్తిలో ఆదిత్యుని దర్శించుకుంటున్న భక్తులు


ఎలమంచిలి: గొల్లల కొండపై సూర్యనారాయణస్వామి ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు


పాయకరావుపేట రూరల్: గోపాలపట్నం సీతమ్మవారి కొండపై పాలు పొంగిస్తున్న మహిళలు


పాయకరావుపేట: పాండురంగస్వామి ఆలయంలో రథసప్తమి ప్రత్యేక పూజ నిర్వహిస్తున్న దృశ్యం

నూకాంబికను దర్శించుకున్న హోం మంత్రి అనిత

ఎస్.రాయవరం, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గోకులపాడులో ఉన్న నూకాంబిక అమ్మవారిని రాష్ట్ర హోం శాఖ మంత్రి వంగలపూడి అనిత మంగళవారం దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. గ్రామానికి వచ్చిన మంత్రి అనితకు జనసేన నేత మత్తి కార్తీక్, టీడీపీ నాయకులు, గ్రామస్థులు ఘన స్వాగతం పలికారు. నూకాంబికను దర్శించుకున్న హోం మంత్రి అనితకు కార్తీక్ దంపతులు వేంకటేశ్వరస్వామి చిత్రపటాన్ని జ్ఞాపికగా అందజేశారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి (కిసాన్ మోర్చా) పాకలపాటి రవిరాజు, టీడీపీ మండల అధ్యక్షుడు అమలకంటి అబద్ధం, నాయకులు ఎన్. వెంకటరాజు, తుంపాల నాగేశ్వరరావు, గుర్రం రామకృష్ణ, బీమరశెట్టి శ్రీనివాసరావు, కోన అప్పలరాజు, బోయిన రామఅవతారం, జనసేన నేత నక్కా శ్రీనివాసరావు పాల్గొన్నారు.


మంత్రి అనితకు జ్ఞాపికను అందిస్తున్న దృశ్యం

పార్కులో అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటు


పార్కులో ఏర్పాటుచేసిన అంబేడ్కర్ విగ్రహం

పాయకరావుపేట, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): స్థానిక పార్కులో గుర్తుతెలియని వక్తులు ధ్వంసం చేసిన డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ విగ్రహం స్థానంలో మంగళవారం కొత్తగా విగ్రహం ఏర్పాటుచేశారు. పట్టణంలో జాతీయ రహదారి అవతల ఉన్న పార్కులో ఉన్న అంబేడ్కర్ విగ్రహాన్ని ఇటీవల గుర్తుతెలియని వ్యక్తులు ధ్వంసం చేసిన విషయం తెలిసిందే. దీనిపై స్థానిక దళిత నాయకులు సోమవారం ఆందోళన చేశారు. సంఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న విషయం కూడా తెలిసిందే. ఇదిలా ఉంటే ధ్వంసమైన విగ్రహం స్థానంలో మంగళవారం కొత్తగా మరో విగ్రహాన్ని ఏర్పాటు చేశారు.

ఈ కార్యక్రమంలో దళిత నాయకులు పల్లా విలియంకేరి, నెలపర్తి నాగేశ్వరరావు, ఇంజరపు సూరిబాబు, ఐఎస్. మూర్తి, గారా రమేష్, చిరుకూరి పేేరాజు, కొల్లాబత్తుల దిలీప్, ఎస్.సత్యనారాయణ, పల్లా సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

క్యాన్సర్‌పై అవగాహన ర్యాలీలు

అచ్యుతాపురం, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): క్యాన్సర్ సోకడానికి వయోభేదం లేదని, ఎవరికైనా సోకవచ్చని స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి లిఖిత అన్నారు. ప్రపంచ క్యాన్సర్ దినం సందర్భంగా వైద్య సిబ్బంది అచ్యుతాపురంలో అవగాహన ర్యాలీని నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ కొంత మందిలో వంశ పారంపర్యంగా కూడా క్యాన్సర్ వ్యాధి వచ్చే అవకాశం ఉందన్నారు. నాలుగు పదులు వయసు దాటిన వారు ప్రతి ఆరు నెలలకు ఒకసారి వైద్య పరీక్షలు చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ వేణుగోపాల్‌తోపాటు సిబ్బంది పాల్గొన్నారు.

మునగపాకలో..

ప్రతి ఒక్కరూ పరీక్ష చేయించుకోవడం ద్వారా క్యాన్సర్‌ను నివారించవచ్చునని స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారిణి ఎన్.విమలగిరి పేర్కొన్నారు. స్థానిక పీహెచ్‌సీ సబ్‌సెంటర్ వద్ద మంగళవారం క్యాన్సర్ వ్యాధిపై నిర్వహించిన అవగాహన సదస్సులో ఆమె మాట్లాడారు. ప్రతి ఒక్కరికి క్యాన్సర్ పరీక్ష నిర్వహించాలని ప్రభుత్వం ఆలోచనలు చేస్తోందని, ఇంటింటికి వచ్చి ఉచితంగా చేయడం జరుగుతుందన్నారు. సర్పంచ్ దిమ్మల అప్పారావు మాట్లాడుతూ 104 ద్వారా అందిస్తున్న సేవలను వినియోగించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పీహెచ్‌సీ సిబ్బంది, ఎఎన్‌ఎంలు, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.


అచ్యుతాపురంలో క్యాన్సర్‌పై అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

టెన్త్ విద్యార్థులు ఒత్తిడి లేకుండా చదవాలి

▸▸ డిప్యూటీ డీఈవో అప్పారావు

ఎలమంచిలి, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి విద్యార్థులు ఒత్తిడి లేకుండా ఉపాధ్యాయుల సూచనలకు అనుగుణంగా చదువుకోవాలని డిప్యూటీ డీఈవో పెన్నాడ అప్పారావు అన్నారు. మంగళవారం రాత్రి మండలంలోని జంపపాలెం, కశింకోట మండలం ఏనుగుతుని గ్రామాల్లోని టెన్త్ విద్యార్థుల గ్రూప్ స్టడీ సెంటర్స్‌ను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థుల పఠనా సామర్థ్యాన్ని పరిశీలించారు. పదో తరగతి విద్యార్థులు గ్రూపు స్టడీ చేసేందుకు ప్రత్యేక శ్రద్ధ కనబరచాలన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు ఏవీఎస్. శాస్త్రి, బొడ్డేటి సత్యనారాయణ, విశ్వేశ్వరరావు, కేఆర్.నాయుడు, కృష్ణారావు, సుధాకర్ పాల్గొన్నారు.

మత్స్యకారులకు వేట నిషేధ భృతి ఇవ్వాలి : సీపీఐ

నక్కపల్లి, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): మత్స్యకారులకు వేట నిషేధ భృతిని తక్షణమే ప్రభుత్వం మంజూరు చేయాలని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి దొరబాబు డిమాండ్ చేశారు. మంగళవారం రాజయ్యపేట సముద్రతీరంలో మత్స్యకారులను కలిసి ఆయన మాట్లాడారు. గత ఏడాది ఏప్రిల్ నుంచి జూన్ వరకూ చేపల వేట నిషేధ భృతి ఇంకా ఇవ్వకపోవడం బాధాకరమన్నారు. అధికారంలోకి వస్తే వేట నిషేధ పరిహారాన్ని పెంచుతామని చెప్పిన కూటమి ప్రభుత్వం ఇంతవరకు ఇవ్వకపోవడం సమంజసం కాదన్నారు. ఇప్పటికే రసాయన పరిశ్రమల నుంచి వస్తున్న కాలుష్యం కారణంగా మత్స్యసంపద నాశనమవుతుందని ఆవేదన వెలిబుచ్చారు. కార్యక్రమంలో సన్యాసిరావు, అర్జున్. అజయ్, బొంది బాబ్జీ, పిక్కి అంజి పాల్గొన్నారు.

ఫ్లెక్సీల తొలగింపు, విగ్రహాలకు ముసుగు

▸▸ ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

ఎస్.రాయవరం, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాల్లో దర్శనమిచ్చిన పలు పార్టీ నేతల ఫ్లెక్సీలను మంగళవారం సిబ్బంది తొలగించారు. ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చినప్పటికీ పలు గ్రామాల్లో ఫెక్సీలను తొలగించకపోవడంతోపాటు విగ్రహాలకు ముసుగులు వేయకపోవడంతో మంగళవారం 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురించిన కథనానికి తహసీల్దార్ జె రమేష్‌బాబు స్పందించారు. వెంటనే ఆయన ఆదేశాలతో జంగులూరు, వెలంపాలెం గ్రామాల్లో ఉన్న తెలుగుదేశం పార్టీ, వైసీపీ నేతల ఫెక్సీలను సిబ్బంది తొలగించడమే కాకుండా అదే గ్రామంలో ఉన్న రాజశేఖరరెడ్డి విగ్రహానికి ముసుగు వేశారు. అలాగే గోకులపాడులో ఉన్న వైఎస్ఆర్ విగ్రహానికి కూడా ముసుగు వేసి, వమ్మవరం, పెనుగొల్లు గ్రామాల్లో ఉన్న ఫెక్సీలను సిబ్బంది తొలగించారు.


గోకులపాడులో రాజశేఖరరెడ్డి విగ్రహానికి ముసుగు వేసిన దృశ్యం

నూతన ఎంఈవో-2ను కలిసిన పీఆర్‌టీయూ బృందం

ఎస్.రాయవరం, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): మండల ఇన్‌చార్జి విద్యాశాధికారిణి-2గా బాధ్యతలు చేపట్టిన స్వప్నప్రియరెడ్డిని మంగళవారం పీఆర్‌టీయూ బృందం మర్యాదపూర్వంగా కలిసి శుభాకాంక్షలు తెలిపింది. ఈ సందర్భంగా పీఆర్‌టీయూ మండల అధ్యక్షుడు భద్రరావు మాట్లాడుతూ మండలంలో తొలిసారిగా ఎంఈవోగా మహిళ బాధ్యతలు చేపట్టడం శుభపరిణామం అన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు సత్యనారాయణ, శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు విజయలక్ష్మి, సత్యవతి, యూఆర్‌కే శ్రీను, రామారావు, ప్రకాష్, ప్రసాద్, చక్రవర్తి, రామునాయుడు, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా పాండురంగడి దివ్య కల్యాణం

పాయకరావుపేట, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి) : స్థానిక పాండురంగస్వామి ఆలయంలో మంగళవారం స్వామివారి దివ్య కల్యాణం అత్యంత వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా మంగళవారం తెల్లవారుజామున స్వామి, అమ్మవార్లకు సుప్రభాతసేవ, పంచామృతాభిషేకం, నూతన వస్త్రధారణ విశేష పూజలు నిర్వహించారు. ఉదయం ప్రాతరారాధన, అగ్నిప్రతిష్ఠాపన, బలిహరణ ధ్వజారోహణ, మంగళశాసనం, తీర్థప్రసాద గోష్ఠి నిర్వహించారు. మధ్యాహ్నం శోభాయాత్రలో భాగంగా స్వామివారి ఉత్సవమూర్తిని గరుడ వాహనంపై తిరువీధి, ఎదురు సన్నాహక ఉత్సవాలు నిర్వహించారు. రాత్రి 7 గంటలకు ఆలయ ప్రధానార్చకులు యి.కృష్ణస్వామి, నారాయణాచార్యుల ఆధ్వర్యంలో పాండురంగస్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులకు దివ్యకల్యాణ మహోత్సవ క్రతువును అత్యంత వైభవంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ఈవో కె.దివ్యతేజ, తూములూరి వీరభద్రరావు, అధిక సంఖ్యలో భక్తులు స్వామివారి కల్యాణాన్ని కనులారా వీక్షించి తరించారు.


పాండురంగస్వామి దివ్య కల్యాణం నిర్వహిస్తున్న దృశ్యం

ఏఐవైఎఫ్ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలి

ఎలమంచిలి, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): ఈనెల 6వ తేదీ నుంచి మూడు రోజులపాటు శ్రీకాకుళంలో జరిగే రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని అఖిల భారత యువజన సమాఖ్య(ఏఐవైఎఫ్)ప్రతినిధులు ప్రకటనలో కోరారు. ఈ మేరకు మంగళవారం ఎలమంచిలి సంఘ ప్రతినిధులంతా కలిసి పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఏఐవైఎఫ్ 22వ రాష్ట్ర మహాసభలను యువతీ యువకులు, నిరుద్యోగులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. జాబ్ క్యాలెండర్ విడుదల, నిరుద్యోగ భృతి విడుదల హామీ, వంటి సమస్యలపై రాష్ట్ర మహాసభల్లో చర్చించడం జరుగుతుందని ఏఐవైఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి వియ్యపు రాజు తెలిపారు.


మహాసభల పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న దృశ్యం

రైతులందరికీ గుర్తింపు కార్డులు : ఆర్డీవో రమణ

నక్కపల్లి, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): ఆధార్ తరహాలో రైతులకు 11 అంకెలతో ప్రత్యేక గుర్తింపు కార్డులను అందజేసేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకుంటున్నట్టు నర్సీపట్నం ఆర్డీవో వీవీ రమణ చెప్పారు. మంగళవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో మండల వ్యవసాయాధికారి ఉమా ప్రసాద్‌తో కలిసి మాట్లాడారు. ప్రస్తుతం అందుబాటులో వున్న సాంకేతిక పరిజ్ఞానాన్ని వ్యవసాయరంగానికి అనుసంధానం చేసే ప్రక్రియ జరుగుతోందన్నారు. ఫార్మర్ రిజిస్ట్రీని ఏర్పాటు చేసి రైతులకు గుర్తింపు కార్డులను ప్రభుత్వం అందజేస్తుందని చెప్పారు.

ఉపమాక సచివాలయం తనిఖీ

నక్కపల్లి, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి):మండలంలోని ఉపమాక సచివాలయాన్ని మంగళవారం ఎంపీడీవో డీ సీతారామరాజు తనిఖీ చేశారు. మిస్సింగ్ సిటిజన్స్, ఈ సర్వీసెస్ పెండింగ్ అమౌంట్, ఎంఎస్ఎంఈ సర్వే, సచివాలయ ఉద్యోగుల హాజరు వంటి అంశాలను పరిశీలించారు. ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమలు గురించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో సెక్రటరీ జయరాం తదితరులు పాల్గొన్నారు.

యాజమాన్య పద్ధతులతో అపరాలలో అధిక దిగుబడులు

పాయకరావుపేట రూరల్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): రైతులు అపరాల సాగులో సస్యరక్షణ, యాజమాన్య పద్ధతులు పాటిస్తే మంచి దిగుబడులు సాధించవచ్చని మండల వ్యవసాయాధికారి పి. ఆదినారాయణ అన్నారు. మండలంలోని శ్రీరాంపురం, వెంకటనగరం గ్రామాలలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులకు అపరాల సాగులో తీసుకోవలసిన జాగ్రత్తలు, సూచనలు అందజేశారు. చీడపీడల నివారణ చర్యలను వివరించారు. ఎన్‌పీఎస్ఎస్ యాప్ గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సిబ్బంది వీరబాబు, గోపి పాల్గొన్నారు.

ఘనంగా ఆంజనేయస్వామి తీర్థం

అచ్యుతాపురం, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): అచ్యుతాపురం జంక్షన్‌లో మంగళవారం ఆంజనేయ స్వామి తీర్థం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ఆంజనేయ స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండల కేంద్రంతోపాటు ప్రధాన కూడలి కావడంతో వివిధ ప్రాంతాల భక్తులు స్వామిని దర్శించుకున్నారు. ఈసందర్భంగా నిర్వాహకులు మంచినీరు, పులిహోర, మజ్జిగ ఉచితంగా పంపిణీ చేశారు. మధ్యాహ్నం అన్న సమారాధన ఏర్పాటుచేశారు. కార్యక్రమంలో మోసయ్యపేట, రామన్నపాలెం సర్పంచులు పంచదార్ల పైడిరాజు, డ్రీమ్స్ నాయుడు, పుర్రే శ్రీనివాస యాదవ్, ఎంపీటీసీ సభ్యుడు లాలం శ్రీనివాస రావు, దర్మిరెడ్డి బాబు, ధూళి వెంకి తదితరులు పాల్గొన్నారు.


ఆంజనేయ స్వామిని దర్శించుకుంటున్న భక్తులు

కొడవటిపూడిలో రోడ్డు సమస్యపై ఆర్డీవో విచారణ


రికార్డులు పరిశీలిస్తున్న నర్సీపట్నం ఆర్‌డీవో రమణ

కోటవురట్ల, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని కొడవటిపూడి రహదారిని నర్సీపట్నం ఆర్డీవో జీవీ రమణ మంగళవారం పరిశీలించారు. కొడవటిపూడి గ్రామంలో ఒక వ్యాపారి రామ్‌కుమార్ వర్మ అరకు నుంచి కాఫీ పిక్కలు తీసుకువచ్చి కాఫీ ప్రాసెసింగ్ యూనిట్‌ను ఏర్పాటు చేయనున్నారు. అయితే యూనిట్ ఏర్పాటు కోసం రహదారి, విద్యుత్ సరఫరా ఇప్పించాలని ఆయన కలెక్టర్‌కు దరఖాస్తు చేసుకున్నారు. 300 మీటర్లు పొడవునా రహదారి నిర్మించేందుకు మధ్యలో ప్రభుత్వభూమి ఉంది. ఈ భూమిని కొందరు రైతులు ఆక్రమించుకున్నారు. ఆ భూమిలో రహదారి నిర్మాణానికి అనుమతులు ఇప్పించాలని కలెక్టర్‌కు దరఖాస్తు చేసుకున్నారు. దీనిపై నర్సీపట్నం ఆర్డీవో రమణ విచారణ చేపట్టారు. ఆయన వెంట తహసీల్దార్ తిరుమలబాబు, రెవెన్యూ సిబ్బంది, సర్వేయర్ ఉన్నారు.

ఘనంగా దుర్గాదేవి ఆలయ వార్షికోత్సవం

మునగపాక, ఫిబ్రవరి 4 (ఆంధ్రజోతి): స్థానిక దుర్గాదేవి ఆలయం 14వ వార్షికోత్సవం మంగళవారం ఘనంగా జరిగింది. భక్తులు పెద్ద ఎత్తున తరలి వచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి, మధ్యాహ్నం అన్నసమారాధన ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో దొడ్డి జయమ్మ, దొడ్డి గంగసూరిఅప్పారావు, గోవింద తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఆంజనేయస్వామి ఆలయ వార్షికోత్సవం

ఎలమంచిలి, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని రామారాయుడుపాలెం వార్డులో మంగళవారం ఆంజనేయ స్వామి ఆలయ వార్షికోత్సవాన్ని భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఉదయం నుంచి భక్తులు ఆంజనేయ స్వామివారిని దర్శించుకొని పూజలు చేశారు. ఈ సందర్భంగా అన్న సమారాధన నిర్వహించారు. సాయంత్రం భక్తి కీర్తనలు, భజన కార్యక్రమాలను నిర్వహించారు.

ఎలమంచిలి బైపాస్ రోడ్డులో పనులు

▸▸ రాళ్లు తేలిన చోట బాగు చేయించిన అధికారులు

▸▸ ఆంధ్రజ్యోతి ఎఫెక్టు


బైపాస్ రోడ్డుపై రాళ్లు తేలిన గోతిని పూడ్చిన దృశ్యం

ఎలమంచిలి, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): ఎలమంచిలి బైపాస్ రోడ్డుపై మూడు రోజుల క్రితం చేపట్టిన గోతులు పూడ్చివేత పనుల్లో నాణ్యతా లోపంపై మంగళవారం 'మూన్నాళ్ల ముచ్చట' శీర్షికతో 'ఆంధ్రజ్యోతి' ప్రచురితమైన కథనానికి ఆర్‌అండ్‌బీ అధికారులు స్పందించారు. పత్రికలో కథనం రావడంతో మంగళవారం అధికారులు దగ్గరుండి పిక్కలు తేలిపోయిన చోట ప్యాచ్ వర్కు చేపట్టారు. ఈ సందర్భంగా 'ఆంధ్రజ్యోతి'ని పలువురు అభినందించారు.

బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించిన 20 మందిపై కేసులు

మునగపాక, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించిన 20 మందిపై కేసు నమోదు చేసినట్టు స్థానిక ఎస్ఐ పి.ప్రసాదరావు తెలిపారు. మండలంలోని పలు గ్రామాల్లో మంగళవారం పర్యటించగా బహిరంగంగా మద్యం సేవిస్తున్న వారిని గుర్తించామన్నారు. మద్యం బహిరంగంగా సేవిస్తే తీసుకోబోయే చట్టపరమైన చర్యలు గురించి అవగాహన కల్పించారు..

మల్లికార్జునస్వామి ఆలయ ప్రహరీకి శంకుస్థాపన

అచ్యుతాపురం, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): ఎంజేపురంలోని మల్లికార్జునస్వామి ఆలయ ప్రహరీ నిర్మాణానికి మంగళవారం శంకుస్థాపన చేశారు. ఈప్రహరీ నిర్మాణానికి దేవదాయ శాఖ రూ.పది లక్షలు మంజూరుచేసింది. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ కింతాడ శ్రీనివాసరావు, మాజీ సర్పంచ్ కొర్లెడ్ల సూర్యప్రకాష్, పతివాడ చిన్నయ్యనాయుడు, పీలా కాసుబాబు, బీముని నాగేశ్వరరావు, నాయుడు, గౌతు రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

రైతులు పంట నమోదు చేయించుకోవాలి

రాంబిల్లి, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): రైతులు రబీలో పంట నమోదు, ఈకేవైసీ చేయించుకోవాలని మండల వ్యవసాయాధికారిని సి.సుమంత అన్నారు. మంగళవారం మర్రిపాలెం, కట్టుబోలు గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె రైతులతో కలిసి ఆయా గ్రామాల్లో పంటలను పరిశీలించి, పలు సూచనలు చేశారు. అపరాలు పంటను ఆశించిన తెగుళ్ల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో ఎంపీఈవో రామారావు, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది చిన్నారావు, కనకరత్నం, హైమ, రైతులు పాల్గొన్నారు.

బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తున్న ఆరుగురుపై కేసు

రాంబిల్లి, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి) : బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తున్న ఆరుగురు వ్యక్తులపై మంగళవారం కేసు నమోదు చేసినట్టు సీఐ నర్సింగరావు తెలిపారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తున్న వారిపై ప్రత్యేక చర్యలు తీసుకోవడం జరిగిందన్నారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించేవారు ఎంతటి వారైన సరే ఊరుకొనేది లేదని సీఐ నర్సింగరావు స్పష్టం చేశారు.



ఉత్సవాల్లో కోలాటం చేస్తున్న భక్తులు... అభయాంజనేయస్వామికి పూజలు చేస్తున్న స్పీకర్ అయ్యన్నపాత్రుడు దంపతులు

నేత్రపర్వంగా అభయాంజనేయస్వామి తీర్థం

నర్సీపట్నం, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): శివపురం అభయాంజనేయ స్వామి ఆలయంలో 26వ తీర్థ మహోత్సవం మంగళవారం నేత్ర పర్వంగా జరిగింది. స్పీకర్ అయ్యన్నపాత్రుడు, పద్మావతి దంపతులు స్వామివారిని దర్శించుకుని పూజలు చేశారు. ఉత్సవాల్లో భాగంగా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కోలాటాలు, శక్తివేషాలు, కాంతారా వేషధారణ ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. అలాగే డాన్స్ బేబీ డాన్స్ కార్యక్రమం ఆకట్టుకుంది. కౌన్సిలర్ దనిమిరెడ్డి మధు, ఆలయ కమిటీ సభ్యులు పి.గోవింద్ పాల్గొన్నారు.

ఈఈఎంటీ మెయిన్స్‌లో విద్యార్థుల ప్రతిభ భేష్: ఎంఈవో మూర్తి

మాకవరపాలెం, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): ఈఈఎంటీ మెయిన్స్‌లో మండలానికి చెందిన ఇద్దరు విద్యార్థులు ప్రతిభ చూపడం అభినంద నీయమని ఎంఈవో మూర్తి పేర్కొన్నారు. మండలం కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న జగదీశ్వరరావు, తూటిపాల పాఠశాలలో ఏడో తరగతి చదువుతున్న వెంకటసాయి జిల్లా స్థాయిలో ప్రథమ స్థానాలు సాధించారని చెప్పారు. ఈ ఏడాది జనవరి 9న రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించిన ఈఈఎంటీ-2025 మెయిన్స్‌లో మండలం నుంచి సుమారు 40 మంది పాల్గొనగా, వీరిలో ఇద్దరు ప్రథమ సాధించారన్నారు. ఈ మేరకు మంగళవారం ఇద్దరు విద్యార్థులకు అభినందన సభ నిర్వహించారు. కార్యక్రమంలో హెచ్ఎం అచ్యుత రామయ్య, ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

అగ్నిప్రమాద బాధితుడికి సాయం



వెంకన్న కుటుంబానికి సరకులు అందజేస్తున్న వీరసూర్యచంద్ర

నాతవరం, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గునుపూడిలో జరిగిన అగ్ని ప్రమాదంలో ఇల్లు కోల్పోయిన నిండుగొండ వెంకన్న కుటుంబానికి రాష్ట్ర బీసీ కార్పొరేషన్ డైరెక్టర్ రాజాన వీరసూర్యచంద్ర నిత్యావసర సరకులు అందించారు. జనసేన మండల అధ్యక్షుడు వెలగల వెంకటరమణతో కలసి బాధిత కుటుంబాన్ని మంగళవారం పరామర్శించారు. ఈ సందర్భంగా 50 కిలోల బియ్యం, నిత్యావసర సరకులు అందజేశారు. వెంకన్న కుటుంబానికి ప్రభుత్వ పరంగా సాయం అందేలా చూస్తానని ఈ సందర్భంగా సూర్యచంద్ర చెప్పారు. స్వచ్ఛంద సంస్థలు కూడా ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకుడు మాకిరెడ్డి వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

ఔషధ తనిఖీ అధికారి కార్యాలయానికి తాళం

వారం రోజులుగా ఆఫీసుకు రాని ఇన్‌స్పెక్టర్, సిబ్బంది

కార్యాలయం పని కోసం అనకాపల్లి వెళ్లినట్టు బోర్డు ఏర్పాటు





మూతబడి ఉన్న ఔషధ నియంత్రణ అధికారి కార్యాలయం... అనకాపల్లి ఆఫీసు పని కోసం వెళ్లినట్టు తగిలించిన బోర్డు

నర్సీపట్నం, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): ప్రాంతీయ ఆస్పత్రి ఆవరణలోని ఔషధ తనిఖీ అధికారి కార్యాలయానికి కొద్ది రోజులుగా తాళాలు వేసి ఉంటుంది. కార్యాలయ పనిపై అనకాపల్లి ఆఫీసుకు వెళ్లినట్టు డేటా ఎంట్రీ ఉద్యోగి ఫోన్ నంబరుతో బోర్డు ఏర్పాటు చేశారు. దీంతో మందుల దుకాణాల తనిఖీలు ప్రశ్నార్థకంగా మారాయి.

నర్సీపట్నం ఔషధ తనిఖీ అధికారి కార్యాలయం పరిధిలో 400 మెడికల్ షాపులు ఉన్నాయి. ఈ దుకాణాలను తనిఖీ చేయడం, కొత్త షాపులకు లైసెన్సులు మంజూరు చేయడం డ్రగ్ ఇన్‌స్పెక్టర్ బాధ్యత. ఎమ్మార్పీ కేంటే అధికంగా మందులు అమ్మితే కేసులు రాస్తారు. అలాగే నక్కపల్లిలో నాలుగు, పరవాడలో 20 ఫార్మా కంపెనీలలో తనిఖీ చేసి మంచి ఉత్పాదక అభ్యాసం (జీఎంపీ) ధ్రువపత్రం అందజేయాల్సి ఉంటుంది. కాగా, ఇక్కడ డ్రగ్ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేసిన యుగంధర్ 2023 జూన్ 23న శ్రీకాకుళం బదిలీ అయ్యారు. అప్పటి నుంచి పర్మినెంట్ డ్రగ్ ఇన్‌స్పెక్టర్ పోస్టు భర్తీ చేయలేదు. అనకాపల్లి డ్రగ్ ఇన్‌స్పెక్టర్‌కు ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు. దీంతో సదరు అధికారి రెండు చోట్ల పని భారం కావడంతో ఒకట్రెండు రోజులు వచ్చేవారు. ఇటీవల వారం రోజులుగా కార్యాలయానికి తాళాలు వేసి డేటా ఎంట్రీ ఉద్యోగి కూడా అనకాపల్లి వెళ్లిపోయారు. కార్యాలయం మూసేసి అనకాపల్లి నుంచే పని చేస్తున్నారా? అన్న అనుమానాలు స్థానికంగా వ్యక్తమవుతున్నాయి. దీంతో మందుల దుకాణాల తనిఖీలు సక్రమంగా జరగడం లేదని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ విషయమై అనకాపల్లి డ్రగ్ ఇన్‌స్పెక్టర్ వివరణ కోరడానికి కాల్ చేయగా ఫోన్ పని చేయలేదు. డేటా ఎంట్రీ ఉద్యోగిని వివరణ కోరగా అనకాపల్లి కార్యాలయానికి పనిపై వెళ్లామని చెప్పారు.

భక్తిశ్రద్ధలతో రథసప్తమి వేడుకలు



శక్తిపంచాయతన ఆలయంలో భక్తుల పూజలు

నాతవరం, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వివిధ గ్రామాల్లో మంగళవారం రథసప్తమి వేడుకలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. నాతవరం శ్రీశక్తి పంచాయతన ఆలయ ప్రాంగణంలోని సూర్య దేవాలయంలో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. అలాగే ప్రత్యక్ష దైవం సూర్య భగవానుడు రథసప్తమిని పురస్కరించుకుని లక్ష్మీపురం గ్రామంలో జనసేన నర్సీపట్నం నియోజకవర్గ ఇన్‌చార్జి వీరసూర్యచంద్ర వేడుకలలో పాల్గొని భక్తులకు ప్రసాదాలు అందించారు. మహిళలు దేవాలయాలకు వెళ్లి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

బ్యాటరీ దుకాణంలో చోరీ

నర్సీపట్నం, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో మెయిన్ రోడ్డులోని ఓ బ్యాటరీ దుకాణంలో చోరీ జరిగింది. పట్టణ సీఐ గోవిందరావు అందించిన వివరాలు ఇలా ఉన్నాయి. నర్సీపట్నం మెయిన్ రోడ్డులో మారుతీ ఆటో మార్టు బ్యాటరీ షాపులో దుండగులు షట్టర్ తెరిచి లోపలకు ప్రవేశించారు. క్యాష్ కౌంటర్‌లోని రూ.50 వేలు నగదు అపహరించారు. షాపు యజమాని ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని సీఐ తెలిపారు.

జాతీయ స్థాయి లంగడీ ఆటలో చోద్యం విద్యార్థుల ప్రతిభ



క్రీడాకారులతో హెచ్ఎం శ్రీనివాస్, పీఈటీ నూకరాజు తదితరులు

కృష్ణాదేవిపేట, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): గొలుగొండ మండలం చోద్యం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుతున్న 11 మంది విద్యార్థులు జాతీయ స్థాయి లంగడీ ఆటల్లో అద్భుత ప్రతిభ కనబర్చాలని హెచ్ఎం శ్రీనివాసరావు, పీఈటీ కుందూరు నూకరాజు తెలిపారు. తమిళనాడు రాష్ట్రంలోని పరమకూడి జిల్లా పంబూరులో జనవరి 31 నుంచి ఫిబ్రవరి 3వ తేదీ వరకు జాతీయ స్థాయి లంగడీ ఆటలు పోటీలు జరిగినట్టు చెప్పారు. ఈ పోటీల్లో చోద్యం హైస్కూల్‌కు చెందిన 11 మంది క్రీడాకారులు పాల్గొన్నారన్నారు. దీంతో అక్కడ వివిధ రాష్ట్రాల క్రీడాకారులతో పోటీపడి ఉత్తమ ప్రతిభ కనబర్చడంతో క్రీడాకారులను హెచ్ఎం, సహ ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు అభినందించారు. ఈ సందర్భంగా హెచ్ఎం శ్రీనివాసరావు మాట్లాడుతూ లంగడీ ఆట ఆంధ్రప్రదేశ్‌లో ప్రాచుర్యం లేనప్పటికీ, మిగతా రాష్ట్రాలతో పోటీ పడాలనే ఉద్దేశంతో ఆంధ్రా లంగడీ కోచ్‌గా పీఈటీ కుందూరు నూకరాజు టీమ్‌ను జాతీయ స్థాయికి ఆడించడం అభినందనీయమని హెచ్ఎం చెప్పారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ అదపురెడ్డి గోపాలకృష్ణ, ఎస్ఎంసీ చైర్మన్ సత్తిబాబు, బీసీ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ బొందల రాజు, ఉపాధ్యాయులు రమణ, ప్రసాద్, వాసు తదితరులు పాల్గొన్నారు.

వృథాగా జలజీవన్ పథకం పైపులు



లచ్చన్నపాలెంలో రెండేళ్లుగా వృథాగా పడివున్న పైపులు

మాకవరపాలెం, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): మండలంలో లచ్చన్నపాలెం గ్రామంలో రెండేళ్లుగా జలజీవన్ పథకం పైపులు వృథాగా పడి ఉన్నాయి. గతంలో ఈ గ్రామానికి జలజీవన్ పథకం మంజూరైందని అధికారులు శంకుస్థాపన చేశారు. అయితే ఇంతవరకూ పనులు మాత్రం ప్రారంభించలేదు. ఈ నేపథ్యంలో సచివాలయానికి ఆనుకుని ఉన్న ప్రదేశంలో పైపులు వృథాగా వదిలేశారు. ఎండకు ఎండుతూ, వానకు తడిచిపోతూ పైపులు పోతున్నా అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి జలజీవన్ పనులు చేపట్టి ఇంటింటికీ కుళాయి నీరు అందించాలని ప్రజలు కోరుతున్నారు.

సోలార్ ప్లాంట్ ఏర్పాటుకు స్థల పరిశీలన

మాకవరపాలెం, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని శెట్టిపాలెం, జెడ్.గంగవరం గ్రామాల మధ్యలో సోలార్ ప్లాంట్ ఏర్పాటుకు తహసీల్దార్ ఎల్.రామరావు మంగళవారం స్థల పరిశీలన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్పీకర్ అయ్యన్నపాత్రుడు ఆదేశాల మేరకు స్థలాన్ని పరిశీలించామన్నారు. శెట్టిపాలెం, జెడ్.గంగవరం గ్రామాల్లో ఏలేరు కాలువ భూ సేకరణ అనంతరం మిగిలిన భూమిని పరిశీలించినట్టు చెప్పారు. తహసీల్దార్ వెంట శెట్టిపాలెం సర్పంచ్ అల్లు రామునాయుడు ఉన్నారు.

క్యాన్సర్‌పై అవగాహన ర్యాలీ

గొలుగొండ, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో మంగళవారం క్యాన్సర్‌పై అవగాహన ర్యాలీ నిర్వహించారు. మండలంలోని చీడిగుమ్మల, గొలుగొండ పీహెచ్‌సీల వైద్యులు శ్యామ్‌కుమార్, ధనంజయ్, మధుసూదన్ ఆధ్వర్యంలో ఈ ర్యాలీ సాగింది. ముందుగా గుర్తిస్తే క్యాన్సర్‌ను నిర్మూలించవచ్చునని ఈ సందర్భంగా వైద్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆశ కార్యకర్తలు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

మందుబాబులపై కేసులు

కృష్ణాదేవిపేట, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగడంతో పాటు తాగి వాహనాలు నడుపుతున్న పది మందిపై కేసులు నమోదు చేసినట్టు ఎస్ఐ వై.తారకేశ్వరావు తెలిపారు. కృష్ణాదేవిపేట స్టేషన్ పరిధిలో సోమవారం రాత్రి సిబ్బందితో గస్తీ నిర్వహించామని, ఈ సమయంలో బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగుతున్న వారిపై ఓపెన్ డ్రింకింగ్, తాగి వాహనాలు నడుపుతున్న వ్యక్తులపై డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు నమోదు చేశామన్నారు. మద్యం తాగి వాహనాలు నడిపినా, బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగినా చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.

పశువుల పాక దగ్ధం

నాతవరం, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వెదురుపల్లి గ్రామంలో సోమవారం అర్ధ రాత్రి ఓ పశువుల పాక పాక దగ్ధమైంది. గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్త పంచాడ వెంకటరమణ తన పశువుల పాకలో ఇటీవల నూర్పులు చేయగా వచ్చిన 20 బస్తాల ధాన్యాన్ని ఉంచాడు. అలాగే నాటు ఎడ్ల బండి కూడా ఉంది. గ్రామానికి దగ్గర్లోనే ఉన్న ఈ పాకకు సోమవారం అర్ధ రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టడంతో పాకతో పాటు ధాన్యం, ఎడ్లబండి కాలి బూడిదయ్యాయి. సుమారు రూ.లక్ష ఆస్తి నష్టం వాట్లిందని రైతు వెంకటరమణ వాపోయాడు. టీడీపీ నాయకులు, బీసీ సెల్ మండల నాయకులు వెంకటరమణను మంగళవారం పరామర్శించారు. పశువుల పాకకు నిప్పుపెట్టిన వారిని గుర్తించి శిక్షించాలని వారు డిమాండ్ చేశారు.

ఘనంగా మేడివాడ భక్తాంజనేయ తీర్థం



భక్తాంజనేయ స్వామికి వెండి పళ్లెం సమర్పిస్తున్న భక్తులు

రావికమతం, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): మండలంలో మేడివాడ భక్తాంజనేయస్వామి తీర్థం ఘనంగా నిర్వహించారు. ఏటా రథసప్తమి పురస్కరించుకొని స్వామి వారి తీర్థాన్ని నిర్వహిస్తారు. మంగళవారం ఆంజనేయస్వామికి అభిషేకాలు, ప్రత్యేక పూజలను ఆలయ అర్చకులు శ్రీనివాసాచార్యులు నిర్వహించారు. స్వామివారి మాలధారణ చేసిన భక్తులుతోపాటు భక్తులు వేకువ జాము నుంచే బారులు తీరారు. స్వామివారికి వెండి పళ్లెం, వెండి కల్లు, వెండి నామాలను పట్నాల బ్రహ్మాజీ, సునీత దంపతులు, ఆకోజు రాజేష్, సాయిశ్రీ, లంగోజు సాయిచైతన్య, సాయి జ్యోత్స్న దంపతులు, బరాటం నారాయణగుప్త, కిల్లాడి సన్యాసిరావు, పాచిల శ్రీనివాస్, కొణగళ్ల సోమన్న శెట్టి ఆర్థిక సాయంతో స్వామి వారికి వితరణగా అందజేశారు.

అంబేడ్కర్ విగ్రహాన్ని ధ్వంసం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి

రోలుగుంట, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి) : పాయకరావుపేట పార్కులో అంబేడ్కర్ విగ్రహాన్ని ధ్వంసం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని సీపీఎం నాయకులు ఈరెల్లి చిరంజీవి డిమాండ్ చేశారు. రాజ్యాంగ నిర్మాత విగ్రహాన్ని ధ్వంసం చేయడం సిగ్గుచేటన్నారు. ధ్వంసం చేసిన దుండగులను గుర్తించి తక్షణమే చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో యేసు, అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

వీరాంజనేయ ఎడ్ల జతకు ప్రథమ బహుమతి

దేవరాపల్లి, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రైవాడ శివారు శంభువానిపాలెంలో పరిదేశమ్మ గ్రామ దేవత తీర్థం సందర్భంగా నిర్వహించిన ఎడ్ల పరుగు ప్రదర్శనలో దేవరాపల్లికి చెందిన వీరాంజనేయ ఎడ్లు ప్రథమ స్థానంలో నిలిచాయి. రెండో బహుమతి వావిలపాడు ఎడ్లు నిలిచాయి. విజేతలకు వరుసగా రూ.12వేలు, రూ.పది వేలు, రూ.8 వేలు, రూ.6 వేలు, రూ.5 వేలు, రూ.4 వేలు, రూ.3 వేలు, రూ.2 వేలు, వెయ్యి రూపాయలు బహుమతులను ఉత్సవ కమిటీ ప్రతినిధులు అందజేశారు. ఉగ్గిన దేముళ్లు, చల్లాతాతయ్యలు, నానాజీ తదితరులు పాల్గొన్నారు.

'పరిసరాల పరిశుభ్రతకు ప్రాధాన్యం'

చీడికాడ, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రతకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని చీడికాడ పీహెచ్‌సీ వైద్యాధికారి సునీల్‌కుమార్ సూచించారు. మంగళవారం కోనాం సచివాలయం వద్ద 104 వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా 47 మంది రోగులను తనిఖీ చేసి మందులు అందించారు. ఈ శిబిరంలో హెల్త్ సూపర్‌వైజర్ జి.వెంకటరావు, వైద్య శిబ్బంది మొల్లి వరలక్ష్మి, ఈశ్వరమ్మ, ఆశవర్కర్ సేవలందించారు.

పింఛన్‌లు ఇంటింటికీ వెళ్లి ఇవ్వాలి

చీడికాడ, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం అందజేస్తున్న వివిధ పింఛన్‌లను ఆయా లబ్ధిదారుల ఇంటికి వెళ్లి అందజేయాలని ఎంపీడీవో హేమసుందరరావు ఆదేశించారు. పింఛన్‌ల పంపిణీపై శనివారం సాయంత్రానికి 96 శాతం పూర్తికాగా, మిగతా నాలుగు శాతం పంపిణీపై వరహాపురంలో వృద్ధుడిని, మండలంలోని పలు గ్రామాలకు వెళ్లి పింఛన్‌లు ఏ విధంగా పంపిణీ చేస్తున్నది ఆరా తీశారు. ఆయనతోపాటు పంచాయతీ సెక్రటరీ సత్యనారాయణ ఉన్నారు.

కార్యదర్శులు లేని కోటపాడు సచివాలయం

- అటెండెన్స్ వేసుకొని వెళ్లిపోయిన వైనం
- వెక్కిరిస్తున్న ఖాళీ కుర్చీలు
- నిరాశతో వెనుదిరిగిన ప్రజలు



కె.కోటపాడు సచివాలయంలో ఖాళీ కుర్చీలు దర్శనమిస్తున్న దృశ్యం

కె.కోటపాడు, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని సచివాలయంలో ఉద్యోగులు లేక వెలవెలబోయింది. సచివాలయానికి వెళ్లి ప్రజలకు ఖాళీ కుర్చీలు దర్శనమిచ్చాయి. గ్రామ సచివాలయంలో సిబ్బంది కనిపించకపోయినా హాజరు పట్టీలో అటెండెన్స్ మాత్రం నమోదైంది. వివిధ పనుల కోసం కె.కోటపాడు సచివాలయానికి వెళ్లిన వారికి ఏ ఒక్క ఉద్యోగి కూడా అందుబాటులో లేరని పలువురు విలేకర్లకు తెలిపారు. మంగళవారం మధ్యాహ్నం 12 గంటల వరకు కె.కోటపాడు గ్రామ సచివాలయం పరిస్థితి చూస్తే కార్యాలయంలో ఖాళీ కుర్చీలే దర్శనమిచ్చాయి. ఇంటి పన్ను కడదామంటే కార్యదర్శి, గుమస్తా ఎవరు లేరని వారు తెలిపారు. రెవెన్యూకు సంబంధించి ఏమైనా దరఖాస్తు చేద్దామంటే డిజిటల్ అసిస్టెంట్ ఉండరు. వెల్ఫేర్, మహిళా పోలీస్, ఇంజినీర్, సర్వేయర్, వీఆర్వో ఎవరూ ఆఫీసులో కనిపించ లేదని వారు ఆరోపిస్తున్నారు. ఖాళీ కుర్చీలను ఫొటో తీసి స్థానిక విలేకరులకు అందజేశారు. ఉదయం ఎఫ్ఆర్‌సీ వేసి వెళ్లిపోతున్నారని ఆరోపించారు. తన భూమికి సంబంధించి మ్యూటేషన్‌కు దరఖాస్తు చేయడానికి గత మూడు రోజులుగా తిరుగుతున్నా ఎవరూ కనిపించడం లేదని లక్ష్మీనారాయణ అనే వ్యక్తి ఆరోపించారు. ఇక సామాన్య ప్రజలకు సేవలు ఎలా అందుతాయని ఆయన ప్రశ్నించాడు. ఈ విషయమై స్థానిక సచివాలయ కార్యదర్శి శ్రీను వద్ద విలేకరులు ప్రస్తావించగా.. ఇద్దరు మహిళా ఉద్యోగులు మెటర్నిటీ సెలవుపై వెళ్లారన్నారు. ఒకరు డిప్యూటేషన్, ఇద్దరు పెన్షన్ల వెరిఫికేషన్, ఒకరు బ్యాంకు పనిపై, ఇంకొకరు ఇంటి పన్ను వసూలుకు వెళ్లడం జరిగిందన్నారు. కార్యాలయంలో ఎవరూ లేకపోవడం వాస్తవమేనని అంగీకరించారు.

ఘనంగా రథసప్తమి వేడుకలు



గౌరీపట్నం సూర్యదేవుని ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

చోడవరం, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): రథసప్తమి సందర్భంగా భక్తులు పెద్ద సంఖ్యలో సూర్యదేవునికి పూజలు నిర్వహించారు. మండలంలోని గౌరీపట్నంలో సూర్యదేవుని ఆలయం భక్తుల రద్దీతో కిటకిటలాడింది. అనేక గ్రామాల నుంచి భక్తులు వచ్చి సూర్యదేవుడిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. ఆలయ వ్యవస్థాపకులు కొమ్మోజు నరసింహరాజు ఆధ్వర్యంలో గౌరీపట్నంవాసులు ఏర్పాట్లు చేశారు. భక్తులకు అన్నసమారాధన ఏర్పాటు చేశారు.

చీడికాడలో..

మండలంలోని పలు గ్రామాల్లో రథసప్తమి పూజలు నిర్వహించారు. ఇంటి ఆవరణలో ఆవుపేడ పిడకలపై పాలు పొంగించి సూర్యభగవానుడికి పరమాన్నం, మొక్క పెసలు, రేగుపండ్లు నైవేద్యంగా సమర్పించుకున్నారు. అలాగే గ్రామాల్లోని రామాలయాలు, శివాలయాల్లో రథసప్తమి సందర్భంగా భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు.

కె.కోటపాడులో..

మండలంలోని ఆర్‌పై అగ్రహారంలోని సూర్యనారాయణమూర్తి ఆలయంలో రథసప్తమి పూజలు ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి స్వామివారికి భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. మధ్యాహ్నం ఆలయం వద్ద అన్నసమారాధన నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త మాణిక్యం (సూర్యదేవుడమ్మ), కమిటీ సభ్యులు తామరపల్లి భాస్కరరావు, రామారావు, నానాజీ, రవి, మహేష్, శంకర్, సోమేశ్, నాగేష్, ప్రసాద్, రామ్మూర్తి పాల్గొన్నారు.

తెనుగుపూడి చెరకు కాటా వద్ద వివాదం

- నిలిచిపోయిన చెరకు తరలింపు
- పడిగాపులు కాస్తున్న రైతులు
- ఎండీ దృష్టికి వెళ్లడంతో సమస్య పరిష్కారం



తెనుగుపూడి కాటా వద్ద నిలిచిపోయిన చెరకు

దేవరాపల్లి, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తెనుగుపూడి చెరకు కాటా వద్ద ఇరువర్గాల మధ్య వివాదంతో గోవాడ చక్కెర కర్మాగారానికి చెరకు తరలింపు నిలిచిపోయింది. దీంతో రైతులు అక్కడే పడిగాపులు కాస్తున్నారు. రైతులు కథనం ప్రకారం గత ప్రభుత్వ హయాంలో తెనుగుపూడి వద్ద చెరకు కాటాను ప్రారంభించారు. ఈ కాటాకు తెనుగుపూడి, మారేపల్లి, గరిశింగి, వెంకటరాజపురం గ్రామాల రైతులు చెరకు సరఫరా చేసేవారు. అప్పటి నుంచి చెరకు కాటా వద్ద ముగ్గురు సిబ్బంది పనిచేస్తున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత గతంలో పనిచేసిన సిబ్బందిని మార్చాలని కొద్ది రోజులుగా వివాదం సాగుతోంది. పది రోజులుగా చెరకును ఫ్యాక్టరీకి తరలిస్తున్నారు. గత ప్రభుత్వంలో వారే అక్కడ పని చేస్తుండడంతో కూటమి నాయకులు అభ్యంతరం తెలిపారు. ఇక్కడ పనిచేసే వ్యక్తి డిజిటల్ కాటాను మంగళవారం ఇంటికి పట్టుకుపోయాడు. దీంతో కాటా వద్ద 30 టన్నుల చెరకు తూనిక కాకుండా ఉండి పోయింది. దీనిపై చెరకు రైతులు పెంటకోట అప్పలనాయుడు, దాసరిరామునాయుడు తదితరులు తీవ్ర ఆగ్రహం చెందారు. అక్కడే ఉన్న ఫ్యాక్టరీ సిబ్బందిని నిలదీశారు. వారి నుంచి ఎటువంటి సమాధానం రాకపోవడంతో ఫ్యాక్టరీ ఎండీని ఫోన్ ద్వారా వివరణ కోరగా.. సిబ్బందిని పంపించి సమస్య పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. దీంతో తూనిక పరికరాన్ని తీసుకురావడంతో చెరకు తరలింపు ప్రారంభం కావడంతో రైతులు ఊరట చెందారు.

ఘనంగా చంద్రమ్మ దొర తీర్థం



చంద్రమ్మ దొర విగ్రహానికి పూలమాలలు వేస్తున్న దృశ్యం

మాడుగుల రూరల్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): తొలి సమితి అధ్యక్షులు దొండా చంద్రమ్మ దొర తీర్థం మంగళవారం ఘనంగా నిర్వహించారు. మండలంలోని వీరవిల్లి అగ్రహారం కొత్తరోడ్డులోని చంద్రమ్మ దొర విగ్రహం వద్ద ప్రతీ ఏటా రథసప్తమి సందర్భంగా తీర్థం నిర్వహించడం ఆనవాయితీ. ఈ నేపథ్యంలో మంగళవారం తీర్థం నిర్వహించారు. చంద్రమ్మ దొర విగ్రహానికి మాజీ ఎంపీ పీ పుప్పాల అప్పలరాజు, మాడుగుల మాజీ సర్పంచ్ దంగేటి సూర్యారావు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా పుప్పాల అప్పలరాజు మాట్లాడుతూ దొండా చంద్రమ్మ దొర తొలి సమితి అధ్యక్షునిగా సేవలు అందించి మన ప్రాంతానికి, వీరవిల్లి అగ్రహారం గ్రామానికి పేరు ప్రఖ్యాతలు తీసుకొచ్చారన్నారు. ఈ సందర్భంగా స్థానికులు గ్రామంలో గ్రంథాలయం ఏర్పాటు చేసి చంద్రమ్మ దొర పేరు పెట్టాలని కోరగా.. పుప్పాల అప్పలరాజు స్పందిస్తూ ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి దృష్టికి తీసుకెళ్లి గ్రంథాలయం ఏర్పాటుకు కృషి చేస్తామని చెప్పారు. అనంతరం విద్యార్థులకు నోట్ బుక్స్, పెన్నులు, స్వీట్లు పంచి పెట్టారు. ఈ కార్యక్రమంలో ఆయన కుటుంబ సభ్యులు, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

ఉత్తమ పంచాయతీ సర్పంచ్‌కి సన్మానం

మాడుగుల రూరల్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వీరవిల్లి అగ్రహారం గ్రామానికి జాతీయ ఉత్తమ పంచాయతీ అవార్డు లభించింది. మంగళవారం మానస స్వచ్ఛంద సంస్థ సెక్రటరీ పరమేశ్వరరావు ఆధర్యంలో సర్పంచ్ ఎలగాడ కామలక్ష్మి, ఈశ్వరరావులకు శాలువా కప్పి ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో సంస్థ సభ్యులు రూప, మౌనిక, పద్మ, రాజు తదితరులు పాల్గొన్నారు.

క్యాన్సర్‌పై అవగాహన ర్యాలీ

రావికమతం, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): క్యాన్సర్ మహ్మారిని దూరం చేసేందుకు ముందస్తు చర్యలు పాటించాలని కొత్తకోట పీహెచ్‌సీ వైద్యాధికారిణి రజిని, సురేఖ పిలుపునిచ్చారు. ప్రపంచ క్యాన్సర్ దినం సందర్భంగా మంగళవారం గ్రామంలో వైద్య సిబ్బంది అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్యాన్సర్ రాకుండా తీసుకోవలసిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో ఆరోగ్య విస్తర్ణ అధికారి పాతాళ రామారావు, హెచ్ఎస్.రమణ, హెచ్‌వీ. ఎర్రమ్మ, తదితరులు పాల్గొన్నారు.

యువకుడిని కాపాడిన మత్స్యకారులు

వజ్రపుకొత్తూరు, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): రథసప్తమి పుణ్య స్నానాలకు వెళ్లి అలలో చిక్కుకున్న యువకుడిని స్థానికులు కాపడడంతో ప్రాణాలతో బయటపడ్డాడు. స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. మంగళవారం తెల్లవారుజామున నాలుగు గంటల సమయంలో చోడవరానికి చెందిన సోమరెడ్డి మణి.. శ్రీకాకుళం జిల్లా వజ్రపుకొత్తూరు మండలం అక్కుపల్లిలోని శివసాగర్ బీచ్‌లో స్నానానికి దిగాడు. సముద్రం లోపలకు వెళ్లి స్నానం చేద్దామని ప్రయత్నించాడు. అయితే అలలు, వాటి వల్ల ఏర్పడిన గోతుల్లో చిక్కుకుపోయాడు. ఈత రాకపోవడంతో సాయం కోసం కేకలు వేశాడు. దీనిని గమనించిన తీరంలో ఉన్న యువకులు, మత్స్యకారులు యువకుడిని ఒడ్డుకు చేర్చారు. సపర్యలు చేసి 108 వాహనంలో పలాస ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

గిరిజనుల కోసం ప్రత్యేక బ్యాంకులు ఏర్పాటు చేయాలని వినతి



కేంద్ర ఆర్థికశాఖా మంత్రి నిర్మల్ సీతారామ్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఎంపీ తనూజారాణి

అనంతగిరి, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): మన్యంలో వివిధ ప్రాంతాల్లో ప్రత్యేకంగా గిరిజన బ్యాంకులను ఏర్పాటు చేయాలని కేంద్ర ఆర్థికశాఖ మంత్రి నిర్మల్ సీతారామ్‌ను కోరారు. ఎంపీ దేశ రాజధాని న్యూఢిల్లీ లోని మంగళవారం మంత్రిని మర్యాదపూర్వకంగా కలిసి పలు విషయాలపై విన్నవించారు. గిరిజనులకు బీమా సౌకర్యం, రుణాలను అందించి ఆర్థిక అభివృద్ధికి సహకారం అందించాలని కోరారు. ఏజెన్సీలో పర్యాటకపరంగా ఎన్నో అవకాశాలను ఉన్నాయని, రుణాలను మంజూరుచేయడం ద్వారా గిరిజనులు ఎదిగేందుకు అవకాశం ఉంటుందని వివరించారు. గిరిజనులు సేంద్రియపద్ధతిలో సాగుచేసే అటవీ ఉత్పత్తులకు మార్కెటింగ్ సదుపాయం కల్పించాలన్నారు. ఆర్థిక శాఖ మంత్రిని కలిసిన వారిలో ఎంపీ భర్త వినయ్ ఉన్నారు.

మాస్టర్ అథ్లెటిక్స్‌లో గిరిజన యువకుడి ప్రతిభ



సిల్వర్ మెడల్ అందుకుంటున్న కోటేశ్వరరావు

డుంబ్రిగుడ,ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): జాతీయ స్థాయి మాస్టర్ అథ్లెటిక్స్ పోటీలో గిరిజన యువకుడు కోటేశ్వరరావు ప్రతిభను చాటాడు. గత నెల 31నుంచి ఈ నెల 3వరకు కేరళ రాష్ట్రం త్రిసూర్ జిల్లా కున్నంకులం ప్రభుత్వ బాలురు పాఠశాలలో జరిగిన జాతీయ స్థాయి పోటీల్లో కోర్రా గ్రామానికి చెందిన కోటేశ్వరరావు పోల్‌వల్ట్ విభాగంలో సిల్వర్ మెడల్, ట్రిపుల్ జంప్ విభాగంలో బ్రాంజ్ మెడల్స్ సాధించారు. కూలి పనులు చేసే కుంటుంబం నుంచి వచ్చి ఆయన క్రీడల్లో మక్కువతో ప్రతిభ చాటుతుండడంపై గ్రామస్థులు అభినందించారు. అతనిని ఐటీడీఏ ఆదుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.

గాయపడిన కార్మికురాలికి పరామర్శ



బాధితురాలితో మాట్లాడుతున్న గిరిజన సంఘం మండల ప్రధాన కార్యదర్శి చిరంజీవి

చింతపల్లి, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): విధి నిర్వాహణలో గాయపడిన మధ్యాహ్నభోజన పథకం కార్మికురాలిని విద్యాశాఖ ఆదుకోవాలని గిరిజన సంఘం మండల ప్రధాన కార్యదర్శి సాగిన చిరంజీవి అన్నారు. మంగళవారం గాయపడిన కార్మికురాలు వసుపులేటి లక్ష్మిని ఆయన పరామర్శించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ చెరుకుంపాకలు ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకం నిర్వాహ కార్మికురాలు లక్ష్మి వంట చేస్తుండగా కుక్కర్ పేలి పోవడంతో తీవ్రంగా గాయపడిందన్నారు. ఆమెకు అధికారులు కనీసం వైద్యం చేయించలేదన్నారు. ఇకనైనా మెరుగైన చికిత్స అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంఘం నాయకులు సాగిన వీరన్న పడాల్, వసుపులేటి మోహనరావు పాల్గొన్నారు.

హెల్మెట్ ధారణ తప్పనిసరి : సీఐ

హుకుంపేట ఫిబ్రవరి 4 ఆంధ్రజ్యోతి; వానచోదకులు రికార్డులతో పాటుగా హెల్మెట్ తపనిసరిగా ధరించాలని స్థానిక సీఐ నాయుడు తెలిపారు. మంగళవారం ముందుగా పాఠశాల విద్యార్థులకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. అనంతరం మెయిన్ రోడ్డు వద్ద వాహనలు తనీఖీ నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వాన చోదకులు ట్రాఫిక్ నిబంధనలు పాటించకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ సందర్భంగా 18 మంది వాహనదారులకు విధించారు.

బాల్య వివాహాలను అరికట్టేందుకు పటిష్ఠ చర్యలు: కలెక్టర్

పాడేరు, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): బాల్య వివాహాలను అరికట్టడానికి పటిష్ఠ చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఏఎస్ దినేశ్‌కుమార్ అన్నారు. కలెక్టరేట్‌లో మంగళవారం నిర్వహించిన జిల్లా బాలికల సంక్షేమం, వారి రక్షణకుసంబంధంచి కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. బాల్య వివాహాలు సామాజిక సమస్యగా గుర్తించి వాటిని నివారణపై అవగాహన కార్యక్రమాలు చేపట్టాలన్నారు. బడి బయట ఉన్న పిల్లలను గుర్తించాలని, మండల స్థాయిలో సర్పంచులు, వార్డు మెంబర్లకు ఎంపీడీవోలు వర్క్‌షాప్ నిర్వహంచాలన్నారు. గ్రామాల్లో అవగాహన కల్పించాలని కోరారు. బాల్య వివాహాలు రహిత గ్రామంగా ప్రకటించిన గ్రామానికి ప్రభుత్వ ప్రోత్సాహకాలను అందిస్తామన్నారు. గత సంవత్సరం పదో తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు ఎంత మంది ఇంటర్‌లో చేరారని ఆయన ఆరా తీశారు. అలాగే పదిలో ఉత్తీర్ణత కాని విద్యార్థులను గుర్తించి వారు చదువుకునేలా ప్రోత్సహించాలన్నారు. 15 రోజులకు ఒకమారు బాల్య వివాహాల నివారణపై కమిటీ సమావేశాలు నిర్వహించాలన్నారు. అలాగే జిల్లాలో మిషన్ వాత్సల్య పథకాన్ని పక్కాగా అమలు చేయాలని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ డాక్టర్ ఎంజే.అభిషేక్‌గౌడ, సబ్ కలెక్టర్ శౌర్యమన్ పటేల్, ఐసీడీఎస్ పీడీ ఎన్.సూర్యలక్ష్మి, డీఈవో పి.బ్రహ్మాజీరావు, గిరిజన సంక్షేమ శాఖ విద్యాశాఖ డీడీ ఎల్.రజని, పాడేరు డివిజన్ పరిధిలో సీడీపీవోలు ప్రత్యక్షంగా, రంపచోడవరం, చింతూరు డివిజన్ల పరిధిలోని అధికారులు వర్చువల్‌గా పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ దినేశ్‌కుమార్, పక్కన జేసీ అభిషేక్‌గౌడ, ఐసీడీఎస్ పీడీ సూర్యలక్ష్మి

నాణ్యతలేని పనులతో ప్రజాధనం దుర్వినియోగం

» కాంట్రాక్టర్లపై చర్యలు తీసుకోవాలంటూ నిరసన



కలెక్టరేట్ ఎదుట నిరసన చేపడుతున్న సీపీఐ నాయకులు

పాడేరురూరల్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): పాడేరు డివిజన్ పరిధిలో గత ప్రభుత్వ హయాం నుంచి ఇప్పటి వరకు చేపట్టిన అభివృద్ధి పనుల్లో నాణ్యతలోపంతో ఉన్న వాటిని గుర్తించి సంబంధిత కాంట్రాక్టర్ల లైసెన్స్‌లను రద్దు చేయాలని సీపీఐ జిల్లా సమితి నాయకులు జల్లి రాజుబాబు, అమర్ డిమాండ్ చేశారు. సీపీఐ మండల సమితి ఆధ్వర్యంలో మంగళవారం కలెక్టరేట్ ఎదుట నిరసన చేపట్టారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ వివిధ మండలాల్లో చేపట్టిన బీటీ రోడ్లు, ప్రభుత్వ భవనాలు, స్కూల్ బిల్డింగ్‌లు, వాటర్ ట్యాంక్‌లు, సీసీ.రోడ్లు మెంటైనెన్స్ గడువు పూర్తికాక ముందేమూలకు చేరుతున్నాయన్నారు. ఈ విషయంపై ఐటీడీఏ మీ కోసం కార్యక్రమంలో ప్రజలు వినతులు సమర్పించినా స్పందన లేక పోవడం విచారకరమన్నారు. జి.మాడుగుల మండలం నేరేడివలసలో నాడు-నేడు కార్యక్రమంలో పాఠశాల భవనం మరమ్మతులు తూతూ మంత్రంగా చేపట్టడం వల్లే సోమవారం ఈ భవనం నుంచి పెచ్చులు ఊడిపడ్డాయన్నారు. ఆ సమయంలో విద్యార్థులు బయటకు వెళ్లడంతో అందులోని 32 మంది చిన్నారులకు ప్రమాదం తప్పిందన్నారు. సీపీఐ ఆధ్వర్యంలో చేపట్టనున్న పల్లె పల్లెకు పోదాం-ప్రజా సమస్యలు చూద్దాం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఐ, ఏఐవైఎఫ్ నాయకులు ఎం.లక్ష్మణ్, దిలీప్, రామారావు, కొండమ్మ, కాంతమ్మ, సూరిబాబు పాల్గొన్నారు.

'పాడివద్ద వంతెన నిర్మాణానికి నిధులు మంజూరు చేయించండి'



టీడీపీ ఇన్‌చార్జి ఈశ్వరికి వినతి పత్రమిస్తున్న మురళీకృష్ణ

కొయ్యూరు, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): కొండగోకిరి పంచాయతీ పాడి- రత్నంపేట గ్రామాల మధ్య కొండవాగుపై వంతెన నిర్మాణానికి వీలుగా నిధులు కేటాయింపునకు కృషి చేయాలని టీడీపీ పాడేరు నియోజక వర్గ ఇన్‌చార్జి గిడ్డి ఈశ్వరిని కోరినట్టు సామాజిక సేవకుడు మఠం మురళీకృష్ణ తెలిపారు. ఈ మేరకు మంగళవారం పాడేరులో ఈశ్వరిని కలసి సమస్య విన్నవించినట్టు ఆయన తెలిపారు. ఈ వంతెన ఆధారంగా ఏడు పంచాయతీలకు చెందిన 25 గ్రామాల వారు రాకపోకలు సాగిస్తారని, గత ఏడాది కురిసిన వర్షాలకు వంతెన పూర్తిగా శిథిలమైందని వివరించానన్నారు. ఈ విషయమై ఈశ్వరి స్పందించి సమస్యను పంచాయతీరాజ్ శాఖా మంత్రి దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరిస్తానని హామీ ఇచ్చినట్టు మురళీకృష్ణ ఈ సందర్భంగా తెలిపారు.

నేటి నుంచి ఒకేషనల్ విద్యార్థులకు ప్రయోగ పరీక్షలు

పాడేరురూరల్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): పాడేరు డివిజన్ పరిధిలోని ఒకేషనల్ విద్యార్థులకు ఈ నెల 5వ తేదీ నుంచి 20వ తేదీ వరకు ప్రయోగ పరీక్షలు నిర్వహించనున్నట్టు డీఐఈవో కె.అప్పలరాము, ఏజీఎంసీ విశ్వనాథం తెలిపారు. అలాగే, జనరల్ విద్యార్థులకు ప్రయోగ పరీక్షలకు ఒకేషనల్ ప్రథమ సంవత్సర విద్యార్థులు 1,545 మంది, ద్వితీయ సంవత్సరం 1,322 మంది చొప్పున మొత్తం 2,867 మంది, జనరల్ ఎంపీసీ విద్యార్థులు 1,317, బైపీసీ 1,667 చొప్పున మొత్తం 2,984 మంది పరీక్షలకు హాజరు కానున్నారని తెలిపారు. అన్ని చోట్లా నిఘా మధ్య పరీక్షలు నిర్వహించేలా చర్యలు చేపట్టామని వారు తెలిపారు.

ఉపాధ్యాయులకు శిక్షణ

పాడేరురూరల్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): ఇంటర్ విద్యార్థుల ప్రయోగ పరీక్షల నిర్వాహణపై సైన్స్ ఉపాధ్యాయులకు మంగళవారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల్లో ధోరణి కార్యక్రమం నిర్వహించినట్టు డీఐఈవో కె.అప్పలరాము తెలిపారు. ఒక్కరోజు ఈ శిక్షణలో జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు, గురుకుల, కేజీబీవీ కళాశాలలోని సైన్స్ అధ్యాపకులు పాల్గొన్నారు. ప్రయోగ పరీక్షల నిర్వాహణ, ఆన్‌లైన్‌లో మార్కుల నమోదు తదితర అంశాలపై క్షుణ్ణంగా వివరించారు. ఈ కార్యక్రమంలో ఏజీఎంసీ విశ్వనాథం, స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ శరగడం శ్రీనివాస్, జి.మాడుగుల ఏపీఆర్ కళాశాల ప్రిన్సిపాల్ యండమూరి పారయ్య, సైన్స్ అధ్యాపకులు శేఖర్, రమాదేవి, వివిధ కళాశాలల అధ్యాపకులు పాల్గొన్నారు.

జంతు సంక్షేమం అందరి బాధ్యత

అనంతగిరి, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): జంతు సంక్షేమానికి ప్రతి ఒక్కరూ చేయూత అందించాలని కాశీపట్నం పశువైద్యాధికారి సాగిరి గణేశ్వరరావు అన్నారు. మండలంలోని చిలకలగెడ్డ ఆశ్రమ బాలురు పాఠశాలలో విద్యార్థులకు జంతు సంక్షేమ పక్షోత్సవాల్లో భాగంగా మంగళవారం అవగాహన కల్పించారు. మూగ జీవాల పోషణ, వాటి సంరక్షణపై వివరించారు.. మూగ జీవాలపై ప్రేమతో మెలగాలని కోరారు. వేసవిలో నీటి ఎద్దడి ఉన్న ప్రాంతాల్లో నీటి వసతి కల్పించాలన్నారు. హెచ్ఎం సైమన్, పీడీ లక్ష్మణ్, వెటర్నరీ అధికారి సుధావాణి పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ అభ్యర్థి 'గాదె'కు మద్దతుగా ప్రచారం

గూడెంకొత్తవీధి, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయుల ఎమ్మెల్సీ అభ్యర్థి గాదే శ్రీనివాసుల నాయుడుని గెలిపించాలని పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు యూవీ గిరి అన్నారు. మంగళవారం మండలంలోని రింతాడ, ఆర్‌వీనగర్, జీకేవీధి గిరిజన సంక్షేమశాఖ ఆశ్రమ పాఠశాలలను పీఆర్‌టీయూ నాయకులు సందర్శించారు. ఈకార్యక్రమంలో నాయకులు డీవీ కాలేశ్వరరావు, కుమార్, కె. ప్రశాంత్, మధుబాబు పాల్గొన్నారు.

అసంఘటిత రంగ కార్మికులకు ఈ శ్రమ్ కార్డులు

» జిల్లా కార్మిక శాఖాధికారి సుజాత



కార్మికులనుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్న సుజాత, ఇతర అధికారులు

పాడేరురూరల్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా అసంఘటిత రంగంలో పనిచేస్తున్న ప్రతీ కార్మికుడూ ఈ శ్రమ్ కార్డులను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కార్మిక శాఖాధికారి సుజాత కోరారు. కార్మికులకు ఈ శ్రమ్ కార్డుల పంపిణీకి మంగళవారం స్థానిక ఉమానీలకంఠేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో స్పెషల్ డ్రైవ్ కార్యక్రమాన్ని చేపట్టారు. కార్మికుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ శ్రామిక్ కార్డు లేదా ఈ శ్రమ్ కార్డులను పొందిన అసంఘటిత రంగాల కార్మికులు 60 ఏళ్ల తరువాత పింఛన్, బీమా, వైకల్యం ఉంటే ఆర్థిక సహాయం వంటి ప్రయోజనాలు పొందవచ్చని వివరించారు. . ఈ స్పెషల్ డ్రైవ్‌లో 30 మంది కార్మికులకు ఈ శ్రమ్ కార్డులు అందించారు. రిజిస్ట్రేషన్‌ను కామన్ సర్వీస్ సెంటర్లు, మీ సేవా కేంద్రాలు, గ్రామ సచివాలయాల్లో, మొబైల్ నుంచి ఈ శ్రమ్ కార్డులు పొందవచ్చని తెలిపారు. 18 నుంచి 50 ఏళ్ల వయస్సుగల కార్మికులు, సన్నకారు రైతులు, వాహన డ్రైవర్లు, క్లీనర్లు, హోటల్ కార్మికులు, రైస్ మిల్లు కార్మికులు, అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలు, నర్సరీ, భవన నిర్మాణ కార్మికులు, వడ్రంగి, ఇటుకల తయారీ, ఆటో కార్మికులు తప్పనిసరిగా ఈ శ్రమ్ కార్డుకు రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో కార్మిక శాఖ సహాయాధికారి సూర్యనారాయణరావు, సిబ్బంది పాల్గొన్నారు.

'వైసీపీ బలోపేతానికి కృషి'

అనంతగిరి, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): గిరిజన ప్రాంతంలో వైసీపీ బలోపేతానికి మరింత కృషిచేస్తానని వైసీపీ అరకు అసెంబ్లీ ఎస్టీసెల్ అధ్యక్షుడు రేగబోయిన స్వామి అన్నారు. మంగళవారం అరకువేలిలోని ఎమెల్యే రేగం మత్స్యలింగంను, స్వామి మర్యాదపూర్వకంగా కలిసి సత్కరించారు. తనపై నమ్మకం ఉంచి ఎస్టీసెల్ అధ్యక్షుడి నియమించిన మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి, ఎమ్మెల్యేకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

స్పీకర్ అయ్యన్న వ్యాఖ్యలపై నిరసనలు

జి.మాడుగుల, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి) : ఇటీవల శాసన సభాపతి చింతకాయల అయ్యన్న పాత్రుడు చేసిన వాఖ్యలను ఉపసంహరించుకుంచుకోవాలని గిరిజన సంఘాలు డిమాండ్ చేశాయి. ఈ సందర్భంగా పలువురు మంగళవారం నిరసన వ్య క్తంచేశారు. వారు మాట్లాడుతూ, ఈ నెల 18న స్పీకర్ వ్యాఖ్యలపై గ్రామ స్థాయిలో నిరసన చేపడతామన్నారు. అలాగే, 19న మండల కేంద్రాల్లో ఆందోళన, ఈ నె ల 27న విశాఖలో మహా సభ నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో డీఎల్‌వో నేత మాణిక్యం, బీజేవైం నాయకుడు కిలో రాజన్, లకే రామకృష్ణ, సీపీఎం నాయకుడు సాగిన ధర్మన పడాల్, సంకయ్య తదితరులు పాల్గొన్నారు.

క్యాన్సర్‌పై ప్రజల్లో అవగాహన అవసరం

ప్రభుత్వ మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ హేమలతాదేవి

పాడేరురూరల్, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): క్యాన్సర్ వ్యాధిపై ప్రజలు అవగాహన పెంచుకోవాలని స్థానిక ప్రభుత్వ మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్.టి.హేమలతాదేవి సూచించారు. ప్రపంచ క్యాన్సర్ నిరోధక దినోత్సవం సందర్భంగా పాడేరులో మంగళవారం అవగాహన ర్యాలీని ప్రారంభించారు. అంబేడ్కర్ కూడలి వరకు భారీ ర్యాలీ నిర్వహించి అక్కడ మానవహారం చేపట్టి వ్యాధిపై వివరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలోని 64 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధి గ్రామాలలో క్షేత్ర స్థాయి వైద్య సిబ్బంది ఆధ్వర్యంలో అనుమానిత రొమ్ము క్యాన్సర్, నోటి క్యాన్సర్, గర్భాశయ క్యాన్సర్ స్ర్కీనింగ్ నిర్వహిస్తున్నట్టు చెప్పారు. వ్యాధిని ముందస్తుగా గుర్తించి సకాలంలో చికిత్స తీసుకుంటే నివారించవచ్చని తెలిపారు. ధూమపానం, మద్యపానం, వంటి వాటితో క్యాన్సర్ ప్రమాదాన్ని పెంచుతాయన్నారు. ప్రభుత్వం అందిస్తున్న ఉచిత క్యాన్సర్ స్ర్కీనింగ్ శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో డీఎంహెచ్‌వో షేక్ జమీల్ బాషా, ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్. విశ్వామిత్ర, ఎన్‌సీడీసీడీ ప్రో గ్రామం అధికారి డాక్టర్. టీఎస్.ప్రతాప్, జిల్లా డిప్యూటీ డెమో రవికుమార్, వైద్యాధికారులు, మినుములూరు పీహెచ్‌సీ వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



సీలేరు పీహెచ్‌సీ సిబ్బంది ర్యాలీ

చింతపల్లి: కేన్సర్‌పై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని లంబసింగి పీహెచ్‌సీ వైద్యాధికారి వర ప్రసాద్ అన్నారు. మంగళవారం లంబసింగి జంక్షన్‌లో పారామెడికల్ ఉద్యోగులు, ఆశ కార్యకర్తలు కేన్సర్‌పై అవగాహన ర్యాలీ చేశారు. ఈసందర్భంగా వైద్యాధికారి మాట్లాడుతూ గిరిజన ప్రాంత ప్రజలు కేన్సర్‌పై చైతన్యవంతులు కావాలన్నారు.

సీలేరు,ధారకొండ ఆరోగ్య కేంద్రాల్లో అవగాహన

సీలేరు : జీకేవీధి మండలం సీలేరు, ధారకొండ పీహెచ్‌సీ పరిధిలో వైద్యాధికారులు ఎస్‌కే మస్తాన్‌వల్లీ, హిమబిందు ఆధ్వర్యంలో ర్యాలీలు నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారులు పొగాకు నమలడం, ధూమపాన వల్ల నోటి, గొంతు క్యాన్సర్ వ్యాపిస్తుందన్నారు. మహిళల్లో రొమ్ము, గర్భాశయం కేన్సర్ వస్తుంటాయన్నారు. గర్భాశయం క్యాన్సర్ ప్రాథమిక దశలోనే గుర్తిస్తే నివారణ సులభమని అన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్ ఎస్ ఎన్ త్రినాధరావు, టీబీ సూపర్ వైజర్ అశోక్‌కుమార్ ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

డుంబ్రిగుడ: వ్యసనాలకు దూరంగా ఉంటే క్యాన్సర్ మహమ్మారి బారిన పడే అవకాశాలు తక్కువగా ఉంటాయని స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారులు రాంబాబు, అంబిక అన్నారు. మండల కేంద్రంలో ఆశా కార్యకర్తలు, వైద్యసిబ్బంది అవగాహన ర్యాలీని చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఎంపీహెచ్‌ఈవో శౌరీ, సిబ్బంది పద్మ, మంజుల పాల్గొన్నారు.



ర్యాలీ ప్రారంభిస్తున్న మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ హేమలతాదేవి

హుకుంపేట: వ్యాధులపై ప్రతి ఒక్కరు అప్రమత్తంగా ఉండాలని వైద్యాధికారి సాధన తెలిపారు మండలంలోని ఉప్ప ఆరోగ్య వైద్య సిబ్బందితో ముందుగా సమావేశం నిర్వహించారు అనంతరం అవగాహన గ్రామంలో ర్యాలీ, మానవహారం నిర్వహించారు. డాక్టర్ రేఖ, రణ ప్రతాప్, సిబ్బంది బలోకమ్మ, కైలాస్, సన్యాసిరావు , మురళీ, ఎన్ఎంలు , ఆశలు పాల్గొన్నారు.

పెదబయలు: స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి నిఖిల్ అధ్వర్యంలో ఆశా కార్యకర్తలు, వైద్యసిబ్బంది ర్యాలీ చేశారు.

గూడెంకొత్తవీధి: కేన్సర్‌ని సకాలంలో గుర్తిస్తే నివారణ సులభమని పెదవలస పీహెచ్‌సీ వైద్యాధికారి పృధ్వీష అన్నారు. మంగళవారం పంచాయతీ కేంద్రంలో వైద్యసిబ్బంది నిర్వహించిన ర్యాలీలో ఆమె మాట్లాడారు. ఈ కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ ఎస్. శ్రీనివాసరావు, ఎంపీహెచ్‌ఈవో బాలరాజు, హెచ్‌వీ దేవమణి పాల్గొన్నారు.

ఘనంగా ముగిసిన రథసప్తమి వేడుకలు



స్వామిని దర్శించుకున్న దేవాదాయ శాఖ సహాయ కమిషనర్ సుధారాణి

పాడేరురూరల్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని డి.గొందూరు పంచాయతీ సూకూరుపుట్టు సూర్యానగర్‌లోని సూర్యనారాయణ స్వామి ఆలయంలో వీహెచ్‌పీ కార్యదర్శి, జిల్లా గిరిజన అర్చకుల సంఘం అధ్యక్షుడు కూడా రామకృష్ణ పరమహంస ఆధ్వ ర్యంలో రథసప్తమి వేడుకలు మంగవారం ఘనంగా నిర్వహించారు. దేవాదాయ శాఖ అనకాపల్లి, అల్లూరి జిల్లా సహాయ కమిషనర్ సుధారాణి మంగళవారం ఉదయం ఆలయానికి చేరుకొని స్వామి వారికి ప్రత్యేక పూజలను చేపట్టారు. మన్యంలోని వివిధ గ్రామాల వందలాది మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టారు. మహిళా భక్తులు చేపట్టిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. మధ్యాహ్నం 4 గంటల సమయంలో శోభా యాత్ర చేపట్టారు.

సేంద్రియ సాగుతో అధిక దిగుబడులు

చింతపల్లి, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): ఆదివాసీ రైతులు సేంద్రియ పద్ధతిలో పంటలు సాగు చేయాలని స్థానిక ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ పి. బాలహాస్సేన్ రెడ్డి తెలిపారు. మంగళవారం స్థానిక వ్యవసాయ అధికారి మధుసుదనరావుతో కలిసి శాస్త్రవేత్తల బృందం గొందిపాకలు గ్రామాన్ని సందర్శించింది. రబీలో రైతులు సాగు చేస్తున్న వరి, సంపద కేంద్రంలో తయారు చేస్తున్న వర్మి కంపోస్టును పరిశీలించారు. అలాగే గ్రామానికి చెందిన యువ రైతులు అమృత, సింహాచలం వ్యక్తిగత నిధులతో కాఫీ పల్పింగ్ యూనిట్‌ని ఏర్పాటు చేసుకుని వారు స్వయం ఉపాధి పొందుతూ మరికొంత మందికి పనులు కల్పించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో శాస్త్రవేత్త జోగారావు, అగ్రికల్చర్ సహాయకుడు శోభన్ పాల్గొన్నారు.

'అధిక విద్యుత్ ఉత్పాదనకు కార్మికులు, ఉద్యోగుల కృషి భేష్'



జ్ఞాపికలు, ప్రశంసా పత్రాలతో ప్రాజెక్టు ఉద్యోగులు

ముంచంగిపుట్టు, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రా ఒడిశా రాష్ట్రాలు సంయుక్తంగా నిర్వహిస్తున్న మాచ్‌ఖండ్ జలవిద్యుత్ కేంద్రంలో రికార్డు స్థాయిలో విద్యుత్ ఉత్పాదనకు ఉద్యోగులు, కార్మికులు చేసిన కృషి అమోఘమని ప్రాజెక్టు ఎస్ఈ ఎ.వి. సుబ్రహ్మణ్యేశ్వరరావు అన్నారు. ప్రాజెక్టులో మంగళవారం అభినందన సభ ఏర్పాటు చేశారు. 2023-24లో ప్రాజెక్టులో అత్యధిక విద్యుత్ ఉత్పాదన చేసినందుకు గాను ఇటీవల గణతంత్ర దినోత్సవం పురస్కరించుకొని ఏపీ ప్రభుత్వం ప్రాజెక్టు ఎస్ఈతో పాటు అన్ని విభాగాల ఉద్యోగులకు ఉత్తమ సేవా పురస్కారం ప్రకటించింది. వీటిని స్థానిక ఎస్ఈ ఉద్యోగులకు, కార్మికులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎస్ఈ మాట్లాడుతూ ఏడు దశాబ్దాల ఘన చరిత్ర ఉన్న మాచ్‌ఖండ్‌లో ఇది మూడో అత్యధిక ఉత్పత్తి కావడం విశేషమని అన్నారు. రెట్టింపు ఉత్సాహంతో మరింత విద్యుత్ ఉత్పాదనకు కృషి చేయాలని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రాజెక్టు ఈఈ సివిలఖ కురేష్ ప్రధాన్, డిప్యూటీ ఈఈలు జి.సత్యకిరణ్, సాంబశివకుమార్, ఒబుల్‌రెడ్డి, భ్రజసుందర్‌పాడి, గంగ భవాని, ఉద్యోగులు, కార్మికులు పాల్గొన్నారు.

ప్రారంభం కాకుండానే శిథిలమైన రచ్చబండ

పెదబయలు, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): పెదబయలు మండలం ఇంజరి పంచాయతీ వనగరాయి గ్రామంలో రచ్చబండ పునర్మించాలని బీజేపీ మండల అధ్యక్షుడు కొండపల్లి రాంబాబు డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన తన బృందంతో కలిసి వనగరాయి, చీకుపనస గ్రామాలలో సందర్శించారు. వనగరాయిలో మూడు రోజుల క్రితం నిర్మించిన రచ్చబండ ప్రారంభానికి ముందే శిథిలావస్థకు చేరిందని స్థానికులు ఆయనకు పిర్యాదు చేశారు. దీంతో రాంబాబు రచ్చబండను పరిశీలించి మాట్లాడారు. నాణ్యత ప్రమాణాలు పాటించకుండా నిర్మించిన గుత్తేదారునిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేకుంటే కలెక్టర్‌కు పిర్యాదు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు ఆనంద్, వీరంనాయుడు,మోహన్, గ్రామస్థులు పాల్గొన్నారు.

68 మందికి కంటి వైద్య పరీక్షలు

ముంచంగిపుట్టు, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి) : విశాఖ జిల్లా అంధత్వ నివారణ సంస్థ ఆధ్వర్యంలో తగరపువలసకు చెందిన అనిల్ నీరుకొండ హాస్పిటల్ సహకారంతో స్థానిక సీహెచ్‌సీలో మంగళవారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. 68 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆప్తాల్మిక్ అసిస్టెంట్ కిశోర్ మాట్లాడుతూ చూపు సమస్యతో బాధపడుతున్న 9 మందిని గుర్తించి విశాఖ ప్రభుత్వ కంటి ఆస్పత్రికి ప్రత్యేక బస్సులో తరలించినట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో వైద్యులు శిరీష, గీతాంజలి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

కాఫీ సాగుపై దృష్టి సారిస్తే ఆర్థిక పురోగతి

ముంచంగిపుట్టు, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): కాఫీ సాగుపై గిరిజనులు పూర్తి స్థాయిలో దృష్టి సారిస్తే.. ఆర్థికంగా ఎదిగేందుకు వీలవుతుందని పాడేరు కాఫీ బోర్డు ఎస్ఎల్‌వో సామర్ల రమేశ్ అన్నారు. మండలంలోని కరిముఖిపుట్టు , కించాయిపుట్టు, పనసపుట్టు పంచాయతీల్లో సుమారు 20 గ్రామాల్లో పాడేరు కాఫీ బోర్డు అ దికారులు మంగళవారం పర్యటించారు. కాఫీ రైతులకు పలు సూచనలను ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో 250 కాఫీ కళ్లాలు మంజూరు అయ్యాయని, ఒక్కో కళ్లానికి రూ. 27,500 చొప్పున అందిస్తున్నట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఐటీడీఏ ఏవో శ్రీరాములు, కాఫీ లైజన్ వర్కర్లు జగన్నాథం, నర్సింగ్, హరికృష్ణ, రామచంద్ర, రామ్మూర్తి తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాల పట్ల అప్రమత్తం

పెదబయలు, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి):సైబర్ నేరాలపై అవగహన కలిగి ఉండాలని రూడకోట బ్రాంచి మేనేజర్ వెంకటేశ్వరరావు తెలిపారు. మంగళవారం ఆయన ఆధ్వర్యంలో మండలంలోని పెదబయలు, రోలుగుంట, గురుకుల కళాశాల, కేజీబీవీ పాఠశాలల్లో అవగాహన కల్పించారు. రాజమహేంద్రవరానికి చెందిన విభూతి బ్రదర్స్ వారిచే ఆర్థిక అక్షరాస్యత, రుణాలు, బీమా సైబర్ నేరాలపై అవగాహనకల్పించారు. ఈ కార్యక్రమంలో ఫీల్డు అసిస్టెంట్ చాణక్య, సిబ్బంది పాల్గొన్నారు.

లగేజీ బ్యాగ్ పోయి.. బాధితుడి అగచాట్లు

» తెనాలి సబ్ కలెక్టర్ చొరవతో స్వ గ్రామానికి పయనం



బాధితులను ట్రైన్ ఎక్కిస్తున్న తహసీల్దార్ కార్యాలయ సిబ్బంది

తెనాలి రూరల్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో గాయపడి వైద్యం కోసం వెళ్లిన బాధితుడి లగేజీ బ్యాగ్ పోవడంతో తీవ్ర ఇబ్బంది ఎదుర్కొన్నారు. ఈ స్థితిలో తెనాలి సబ్‌కలెక్టర్ చొరవతో ఆ బాధిత కుటుంబం తిరిగి స్వ గామానికి పయనమైంది. ఈ ఘటన మంగళవారం తెనాలిలో చోటుచేసుకుంది. వివరాలివి.. అల్లూరి జిల్లా పెదబయలు మండలం గంపరాయికి చెందిన కాశయ్యకు ఇటీ వల రోడ్డు ప్రమాదంలో రెండు కాళ్లు దెబ్బతిన్నాయి. కడపలోని ఓ ఆస్పత్రిలో తన అనారోగ్య సమస్యకు వైద్యం ఉందని తెలిసి అక్కడికి కుటుంబం సాయంతో వెళ్లారు. వైద్యులను కలిసి తిరిగి వచ్చే క్రమంలో లగేజీని గుర్తుతెలియని వ్యక్తులు చోరీ చేశారు. దీంతో కట్టుబట్టలతో మిగిలిన ఆ కుటుంబం తిరిగి స్వగ్రామానికి చేరేందుకు కడప రైల్వేస్టేషన్‌కు వెళ్లారు. డబ్బులేని విషయం రైల్వేపోలీసులకు చెప్పారు. ట్రైన్ ఎక్కి టీసీకి వివరాలు తెలిపితే ఇబ్బంది పెట్టరనడంతో కాశయ్యకుటుంబంతో ప్రయాణించారు. అయితే, తెనాలి సమీపంలోకి వచ్చేసరికి తనిఖీకి వచ్చిన టీసీ టిక్కెట్ లేదని వారిని రైలునుంచి దింపేశారు. స్టేషన్‌లో దీనంగా కూర్చున్న వారి దుస్థితిని స్థానికులు సబ్‌కలెక్టర్ సంజనసింహకు సమాచారమిచ్చారు. సబ్‌కలెక్టర్..తహసీల్దార్ గోపాలకృష్ణకు విషయం చెప్పి తక్షణమే వారిని ఆదుకోవాలని ఆదేశించారు. దీంతో స్టేషన్‌కు వెళ్లి వారికి నీరు, ఆహారం అందించి వారి ఆకలితీర్చారు. తిరుగు ప్రయాణానికి అవసరమైన ఏర్పాట్లు చేసి మధ్యాహ్నం జన్మభూమి ట్రైన్ కు టిక్కెట్లు కొనుగోలు చేసి, దారిఖర్చులకు కొంత నగదు సమకూర్చి తహసీల్దార్, సిబ్బందితో వారిని స్టేషన్‌లో ట్రైన్ ఎక్కించారు. ఈ సందర్భంగా కాశయ్య కుటుంబం అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. సబ్‌కలెక్టర్, తహసీల్దార్‌ను పలువురు అభినందించారు.

రాజుపాలేనికి పోటెత్తిన భక్తులు

▸▸ సూర్యనారాయణమూర్తిని దర్శించుకున్న ప్రజాప్రతినిధులు



స్వామివారిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు, మాజీ ఎమ్మెల్యే పీలా



ఆలయంలో సూర్యనారాయణమూర్తి



స్వామివారి దర్శనానికి తరలివచ్చిన భక్తులు

అనకాపల్లి రూరల్, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని రాజుపాలెం సూర్యనారాయణమూర్తి ఆలయంలో మంగళవారం రథసప్తమి వేడుకలను భక్తి శ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. సూర్యోదయ సమయంలో స్వామివారిని దర్శించుకోవడానికి జిల్లా నలమూలల భక్తులు తెల్లవారుజామునే ఆలయం వద్ద బారులు తీరారు. తొలుత స్వామివారికి ఆలయ ప్రధాన అర్చకులు కల్యాణ్ కుమార్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు దర్శనాలు కల్పించారు. ఎమ్మెల్యేలు కొణతాల రామకృష్ణ, భీమిలీ గంటా శ్రీనివాసరావు, మాజీ ఎమ్మెల్యేలు కరణం ధర్మశ్రీ, పీలా గోవింద సత్యనారాయణ, మాజీ ఎమ్మెల్సీ పప్పల చలపతిరావు, పలువురు నాయకులు, న్యాయమూర్తులు సూర్యనారాయణ మూర్తిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం ఆలయ ప్రాంగణంలో భక్తులు స్వామివారి అన్నప్రసాదాన్ని స్వీకరించారు. సాయంత్రం స్వామివారిని రథంపై ఉంచి గ్రామంలో ఊరేగించారు. రథసప్తమి సందర్భంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలను, జానపద కళారూపాలు, భజనలు, కోలాటాలు, తప్పెటగుళ్ల, బుర్రకథలను ప్రదర్శించారు. రథమసప్తమి వేడుకల సందర్భంగా భక్తులు ఇబ్బంది పడకుండా అనకాపల్లి రూరల్ సీఐ జి.అశోక్‌కుమార్ ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా చూడండి

▸▸ సాంఘిక సంక్షేమ శాఖ జిల్లా అధికారి రాజేశ్వరి



సాంఘిక సంక్షేమ శాఖ సిబ్బందితో మాట్లాడుతున్న రాజేశ్వరి

తుమ్మపాల, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): సాంఘిక సంక్షేమ వసతి గృహాల్లో విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రత్యేక చర్యలు చేపట్టాలని ఆ శాఖ జిల్లా అధికారి రాజేశ్వరి సూచించారు. గాంధీనగరంలోని సాంఘిక సంక్షేమ శాఖ వసతిగృహాలను మంగళవారం రాత్రి ఆకస్మికంగా తనిఖీ చేశారు. వసతిగృహంలో జరుగుతున్న అభివృద్ధి పనులపై కాంట్రాక్టర్లతో మాట్లాడారు. పనుల విషయంలో నాణ్యత లోపిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. విద్యార్థులతో మాట్లాడి వసతిగృహంలో మౌలిక సదుపాయాల విషయంపై ఆరా తీశారు. అల్పాహారం, భోజన విషయంలో నాణ్యత లోపిస్తే సహించేది లేదని ఆమె హెచ్చరించారు. విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చూడాల్సిన బాధ్యత సిబ్బందిపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో సాంఘిక సంక్షేమ శాఖ అధికారులు ఈశ్వరరావు, రామయ్య పాల్గొన్నారు.

విద్యార్థుల ఇళ్లు సందర్శించిన డిప్యూటీ డీఈవో



విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలిస్తున్న డిప్యూటీ డీఈవో అప్పారావు

కశింకోట, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): ఏనుగుతుని గ్రామంలో జిల్లా ఉప విద్యాశాఖాధికారి పి.అప్పారావు మంగళవారం రాత్రి విద్యార్థుల ఇళ్లను సందర్శించారు. ఈ సందర్భంగా పదో తరగతి విద్యార్థులు చదువుతున్న అంశాలపై ఆరా తీశారు. వారికి విద్యా సామర్థ్యాలను తెలుసుకొని మరింత ఏకాగ్రతతో విద్యనభ్యసించి పదో తరగతి పరీక్షల్లో మంచి ర్యాంకులు సంపాదించాలని, తద్వారా జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని ఆయన ఆకాంక్షించారు.

సంపద తయారీపై దృష్టి పెట్టండి: డీపీవో

పరవాడ, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): చెత్త నుంచి సంపద తయారీపై దృష్టి సారించాలని జిల్లా పంచాయతీ అధికారి ఆర్.శిరీషారాణి సూచించారు. వెన్నెలపాలెంలోని సంపద తయారీ కేంద్రాన్ని మంగళవారం సందర్శించారు. కేంద్రంలోని రెండు తొట్టిల్లో మాత్రమే వర్మీకంపోస్ట్ ఎరువు తయారు చేసి ఉండడాన్ని గమనించారు. మిగతా ఆరు తొట్టెలు ఖాళీగా దర్శనమివ్వడంతో కార్యదర్శి భారతిపై అసహనం వ్యక్తం చేశారు. అనంతరం పంచాయతీ కార్యాలయాన్ని సందర్శించారు. కల్యాణ మండపం అద్దె ద్వారా వచ్చిన నిధులు పక్కదారి పట్టాయని ఇటీవల గ్రామానికి చెందిన ఓ వ్యక్తి కలెక్టర్‌కు ఇచ్చిన ఫిర్యాదు మేరకు అప్పటి కార్యదర్శి సీహెచ్.వరలక్ష్మిని పిలిపించి డీపీవో విచారించారు. ఆమె నుంచి స్టేట్‌మెంట్ రికార్డు చేశారు. కార్యక్రమంలో డీపీఆర్‌సీ జిల్లా కోఆర్డినేటర్ నాగలక్ష్మి, ఇన్‌చార్జి ఎంపీడీవో ధర్మారావు పాల్గొన్నారు.

క్యాన్సర్‌పై అవగాహన సదస్సులు

అనకాపల్లి టౌన్/సబ్బవరం/కశింకోట/తుమ్మపాల, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో క్యాన్సర్‌పై మంగళవారం అవగాహన సదస్సులు నిర్వహించారు. ధూమపానం, మద్యం సేవించడం, పొగాకు నమలడం వలన నోటి క్యాన్సర్, ఊపిరితిత్తుల క్యాన్సర్ వస్తాయని ఈ సందర్భంగా ప్రముఖ వైద్యులు డీడీ నాయుడు సూచించారు. సన్ స్క్రీన్ లోషన్ రాసుకుంటే స్కిన్ క్యాన్సర్ రాకుండా ఉంటుందన్నారు. అలాగే సబ్బవరం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సీతాలక్ష్మీ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. విద్యార్థి దశ నుంచే క్యాన్సర్‌పై అవగాహన కల్పించాలని సూచించారు. బోటనీ అధ్యాపకులు డాక్టర్ వై.రాజేశ్ మాట్లాడుతూ ఆహారంపైనే ఆరోగ్యం ఆధారపడి ఉంటుందన్నారు. కశింకోట మండలంలోని తాళ్లపాలెం పీహెచ్‌సీ ఆధ్వర్యంలో క్యాన్సర్‌పై అవగాహన ర్యాలీ, సదస్సు నిర్వహించారు. ప్రధాన వైద్యాధికారి ఎ.మనీషా క్యాన్సర్ రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, అందుబాటులో ఉన్న చికిత్స గురించి వివరించారు. అనంతరం ఆరోగ్య విస్తరణాధికారి ఏవీసుబ్బారావు ఆయుష్ సేవల గురించి వివరించారు. తుమ్మపాల పీహెచ్‌సీ వైద్యాధికారి ఎస్.వాణి జగదీశ్వరి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ స్క్రీనింగ్ టెస్ట్‌ను చేయించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమాల్లో వాకర్స్ జిల్లా అధ్యక్షుడు రాపేటి నారాయణరావు, సభ్యులు యల్లపు సాంబశివరావు, చవితిన నరసింగరావు, మాణిక్యాలరావు, ఆడారి మల్లికార్జునరావు, యల్లపు సత్యనారాయణ, కె.జగ్గారావు, సబ్బవరం కళాశాల వైస్ ప్రిన్సిపాల్ బి.శంకర్, ఎన్ఎస్ఎస్ పీవో గణేశ్, వైద్య సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

వైభవంగా రథసప్తమి వేడుకలు

సూర్యనారాయణస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు





గౌరీ పంచాయతన ఆలయంలో స్వామివారికి పూజలు... సుంకరమెట్ట జంక్షన్ వద్ద క్యూలో ఉన్న భక్తులు

అనకాపల్లి టౌన్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సుంకరమెట్ట జంక్షన్ వద్ద గల సూర్యనారాయణస్వామి ఆలయంలో మంగళవారం రథసప్తమి వేడుకలు వైభవంగా నిర్వహించారు. రథసప్తమి కావడంతో స్వామివారిని దర్శించుకునేందుకు ఆలయానికి భక్తులు పోటెత్తారు. తెల్లవారుజామున ఆలయ కమిటీ అధ్యక్షుడు బొడ్డేడ మురళీ ఆధ్వర్యంలో స్వామివారికి ప్రత్యేక పూలంకరణ చేశారు. ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం భక్తులకు దర్శనం కల్పించారు. ఆలయంలోని క్యూలైన్లు నిండిపోవడంతో ప్రధాన మెయిన్ రోడ్డు మీదుగా భక్తులు అధిక సంఖ్యలో స్వామి దర్శనానికి క్యూ కట్టారు.

ఈ సందర్భంగా ఆలయ ఆవరణలో ఏర్పాటు చేసిన కోలాటాలు భక్తులను ఆకట్టుకున్నాయి. స్వామివారిని ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి భీమరశెట్టి రామకృష్ణ (రాంకీ), అర్బన్ ఫైనాన్స్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పీలా గోవింద సత్యనారాయణ, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి దాడి రత్నాకర్ దర్శించుకున్నారు. వీరిని ఆలయ చైర్మన్ బొడ్డేడ మురళీ, ధర్మకర్తలు



స్వామిని దర్శించుకున్న ఎమ్మెల్యే కొణతాల

సత్కరించి జ్ఞాపికలను అందజేశారు. ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా ట్రాఫిక్ సిబ్బంది చర్యలు చేపట్టారు. అలాగే ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పట్టణ సీఐ టీవీ విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో ఎస్ఐలు, సిబ్బంది బందోబస్తు నిర్వహించారు.

సబ్బవరంలో...

సబ్బవరం: మండలంలోని పలు దేవాలయాల్లో రథసప్తమి వేడుకలు ఘనంగా జరిగాయి. మొగలిపురం సూర్యనారాయణస్వామి దేవాలయం, దేవీపురం సహస్రాక్షి రాజరాజేశ్వరీదేవీ పీఠంలో అభిషేకాలు, కుంకుమ పూజలు నిర్వహించారు. మొగలిపురంలో వైసీపీ నాయకులు గండి రవి కుమార్, యడ్ల నాయుడు, నాయకులు సిరపరపు వాసు, కరక రాము, గురి శ్రీనివాస్, అమ్మతల్లి, రామునాయుడు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

ముగిసిన వాసవీమాత ప్రతిష్ఠ శత జయంత్యుత్సవాలు

వెండి రథంపై ఉత్సవమూర్తి ప్రతిమల ఊరేగింపు





వెండి రథంపై ఉత్సవమూర్తిని ఊరేగిస్తున్న కమిటీ ప్రతినిధులు... ఊరేగింపులో నవశక్తుల నృత్యం

అనకాపల్లి టౌన్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): స్థానిక కన్యకాపరమేశ్వరి దేవస్థానంలో అమ్మవారి ప్రతిష్ఠ శతజయంతి ముగింపు ఉత్సవాలు మంగళవారం భక్తిశ్రద్ధలతో జరిగాయి. ఉదయం ఆలయ మండపంలో విఘ్నేశ్వర పూజ, రక్షసూత్ర బంధనం, సూర్య నమస్కారాలతో వేడుకలు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా హోమాలు నిర్వహించారు. సాయంత్రం అమ్మవారి ఉత్సవమూర్తిని వెండి రథం పై ఏర్పాటు చేసి పట్టణ తిరువీధుల్లో మేళతాళాలతో ఊరేగింపు శోభాయాత్ర ఘనంగా ప్రారంభమైంది. ఊరేగింపులో భాగంగా పులి వేషాలు, దేవతామూర్తుల నేల డాన్సు, కోలాటాలు, నవశక్తుల డాన్స్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. మహిళలు వాసవీమాత నామ సంకీర్తనలో పాల్గొన్నారు. రేజేటి శ్రీరామాచార్యులు, రేజేటి సీతారామాచార్యులు పర్యవేక్షణలో ఆలయ ప్రధాన అర్చకులు కొడమంచిలి వీరవెంకట సత్యనారాయణమూర్తి బేబి, కొడమంచిలి కమలాకర్‌శ్రీరామ్ ప్రసాద్ ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి. కార్యక్రమాల్లో ఉత్సవ కమిటీ చైర్మన్ కోరుకొండ బుచ్చిరాజు, కో-చైర్మన్ డాక్టర్ గ్రంధి శేషుకుమార్, ఆలయ కమిటీ అధ్యక్షులు బిళ్లపాటి కృష్ణకుమార్, కార్యదర్శి కొరుపోలు జగదీశ్వరరావు, కోశాధికారి శ్రీధరాల సోమరాజు తదితరులు పాల్గొన్నారు.

టెన్త్‌లో శతశాతం ఉత్తీర్ణత సాధించాలి

అలసత్వం వహిస్తే కఠిన చర్యలు: డీఈవో అప్పారావునాయుడు



ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న డీఈవో అప్పారావునాయుడు

సబ్బవరం, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): ఈ ఏడాది పదో తరగతి పరీక్షల్లో శతశాతం ఫలితాలు సాధించేలా కృషి చేయాలని జిల్లా విద్యాశాఖ అధికారి గిడ్డి అప్పారావునాయుడు సూచించారు. మండలంలోని రావలమ్మపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను మంగళవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా పదో తరగతి విద్యార్థులను పలు ప్రశ్నలు అడిగి సమాధానాలు రాబట్టారు. కష్టపడి చదివి మంచి ఫలితాలు సాధించాలని విద్యార్థులకు సూచించారు. అనంతరం ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించి సత్ఫలితాల సాధనకు ఎటువంటి చర్యలు తీసుకుంటున్నదీ అడిగి తెలుసుకున్నారు. వెనుకబడిన విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించాలని సూచించారు. విద్యార్థుల ఇళ్లకు వెళ్లి పరిశీలించి, తల్లిదండ్రులతో మాట్లాడుతున్నామని ఉపాధ్యాయులు తెలిపారు. అందుకు డీఈవో వారిని అభినందించారు. అనంతరం మధ్యాహ్న భోజన పథకం వంటలు పరిశీలించారు. భోజనం రుచి చూసి, నాణ్యత పట్ల అసంతృప్తి వ్యక్తం చేశారు. ఇంకా మెరుగ్గా వండి పిల్లలకు పెట్టాలని డీఈవో ఆదేశించారు. అలసత్వం వహించిన సిబ్బందిపై కఠిన చర్యలు కఠితీసుకుంటామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డీఈవో కె.అప్పారావు, ఎంఈవో-2 రవీంద్రబాబు, హెచ్ఎం వీకే అరుణకుమారి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అగ్రి-పాలిటెక్నిక్ అంతర్ కళాశాలల పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



పోటీల విజేతలతో ఏడీఆర్ ముకుందరావు

అనకాపల్లి అగ్రికల్చర్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వ విద్యాలయం ఆధ్వర్యంలో మహానందిలో జరిగిన రాష్ట్రస్థాయి అంతర్ వ్యవసాయ పాలిటెక్నిక్ క్రీడా, సాంస్కృతిక పోటీల్లో అనకాపల్లి వ్యవసాయ పాలిటెక్నిక్, వ్యవసాయ ఇంజనీరింగ్ విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. కేరమ్స్‌లో ఎం.కీర్తిస్వరూప్, చదరంగంలో సీహెచ్.శ్రీనివాసులు ప్రథమ స్థానాలను కైవసం చేసుకున్నారు. క్రికెట్‌లో అనకాపల్లి జట్టు ప్రథమ స్థానం సాధించింది. ఈ జట్టుకు పూర్ణచంద్రనాయుడు కెప్టెన్‌గా వ్యవహరించారు. పూర్ణచంద్రనాయుడు 100, 200 మీటర్ల లాంగ్‌జంప్ పోటీలోను, కీర్తి స్వరూప, వి.గాయత్రి టెన్నికాయిట్‌లో ప్రథమ బహుమతిని గెలుపొందారు. సీహెచ్.శ్రీనివాస్‌కు షార్ట్ పుట్‌లో తృతీయ స్థానం లభించింది. కీర్తి స్వరూప డిస్క్‌త్రోలో ద్వితీయ, షణ్ముక 100, 200 మీటర్ల షాట్‌పుట్‌లో, వి.గాయత్రి లాంగ్‌జంప్‌లో తృతీయ బహుమతులను గెలుచుకున్నారు. వక్తృత్వ పోటీల్లో జాహ్నవి రాణి తృతీయ స్థానం సాధించింది. కళాశాల పీడీ పీజీవీఎస్ఎస్ మురళీకృష్ణ స్టూడెంట్స్ యాక్టివిటీస్ ఆఫీసర్ డాక్టర్ ఎ.కేశవ కుమార్ టీచింగ్ అసిస్టెంట్ సాయి శిరీష జట్లకు నాయకత్వం వహించారు. ఏడీఆర్ సీహెచ్.ముకుందరావు, వైస్.ప్రిన్సిపల్ చారుమతి, అగ్రి ఇంజనీరింగ్ పాలిటెక్నిక్ వైస్.ప్రిన్సిపాల్ కుసుమ జట్ల మేనేజర్లు, విజేతలను మంగళవారం ఇక్కడ అభినందించారు.

ఘనంగా అక్కులమ్మ పేరంటాలు తీర్థం



అక్కులమ్మ పేరంటాలకు పూజలు చేస్తున్న కుటుంబ పెద్దలు

సబ్బవరం, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అంతకాపల్లి శివారు రావలమ్మపాలెంలో అక్కులమ్మ పేరంటాలు తీర్థ మహోత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు. జక్కాన సూర్యనారాయణ, శ్రీరామమూర్తి, సూర్యవెంకటరావు, సత్యనారాయణ ఆధ్వర్యంలో ఉదయం 6 గంటల నుంచి అమ్మవారికి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. మధ్యాహ్నం అన్న సమారాధన నిర్వహించారు. సాయంత్రం తప్పెట గుళ్ల, కోలాటం, నేల డ్యాన్స్‌లు, బాణ సంచా కాల్పుల సందడి నెలకొంది. రాత్రికి ఆనందపురం కళాకారులు బాలానాగమ్మ బుర్రకథ ప్రదర్శన జరిగింది. సర్పంచ్ సబ్బవరపు నారాయణమూర్తి, వైస్ ఎంపీపీ చొక్కాకు గోవింద, మాజీ ఎంపీపీ సబ్బవరపు ముత్యాలనాయుడు, నాయకులు రామునాయుడు, దేముడు, జక్కాన శ్రీను, వెంకటరావు, మూలినాయుడు అక్కులమ్మను దర్శించుకున్నారు.

8న కశింకోట గౌరీపరమేశ్వరుల ఉత్సవం

కశింకోట, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): కశింకోటలో ఈ నెల 8న జరగనున్న గౌరీపరమేశ్వరుల మహోత్సవ రాజం పోస్టర్‌ను ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ, నియోజకవర్గ ఇన్‌చార్జి భీమరశెట్టి రాంకీ తదితరులు మంగళవారం అనకాపల్లి మండలం రాజుపాలెం సూర్యనారాయణస్వామి దేవస్థానం ప్రాంగణంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఉత్సవ కమిటీ ప్రతినిధులు వేగి గోపీకృష్ణ, కాండ్రేగుల సతీశ్, వేగి వెంకట్రావు, కొయిలాడ నాగు, బుదిరెడ్డి చిన్న తదితరులు ఉత్సవంలో ఏర్పాటు చేసిన ప్రత్యేకతలను వివరించారు. అనంతరం ఎమ్మెల్యేకు ఆహ్వానపత్రిను అందజేశారు.

ఆశ కార్యకర్తలు అంకితభావంతో పనిచేయాలి

▸▸ జిల్లా ఇమ్యునైజేషన్ ప్రోగ్రామ్ అధికారి చంద్రశేఖర్‌దేవ్

పరవాడ, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): ఆశ కార్యకర్తలందరూ అంకితభావంతో పనిచేయాలని జిల్లా ఇమ్యునైజేషన్ ప్రోగ్రాం అధికారి చంద్రశేఖర్ దేవ్ సూచించారు. ఆశ డేను పురస్కరించుకొని మంగళవారం పరవాడ పీహెచ్‌సీలో ఆశ కార్యకర్తలతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వ్యాధి నిరోధక టీకాలు అందరికీ సకాలంలో అందజేసి యూవీఎన్ యాప్‌లో అప్‌లోడ్ చేయాలని సూచించారు. ఈ నెల 10న జరగబోయే నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా 18 సంవత్సరాల లోపు పిల్లలందరికీ నులిపురుగుల మాత్రలను అందజేయాలన్నారు. బాలల పరిరక్షణ ప్రతినిధి లోవరాజు మాట్లాడుతూ లైంగిక వేధింపులు, బాల్య వివాహాలు, లింగ నిర్ధారణ పరీక్షలు, బాలల హక్కులు తదితర అంశాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యురాలు జయశ్రీ కర్మిషా, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ సాయిరాం, రామచంద్రరావు, జానకి రామన్, ఏఎన్ఎంలు తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో అధిక లాభాలు

▸▸ మండల వ్యవసాయాధికారి రంగాచారి

తుమ్మపాల, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): ప్రకృతి వ్యవసాయంతో రైతులకు అధిక లాభాలు లభిస్తాయని మండల వ్యవసాయ అధికారి పి.రంగాచారి పేర్కొన్నారు. అనకాపల్లి మండలంలోని మాకవరం, కొండుపాలెం గ్రామాల్లో మంగళవారం నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆయన రైతులతో మాట్లాడారు. ప్రకృతి వ్యవసాయం ద్వారా భూసారం పెరుగుదలతో పాటు వ్యవసాయ ఖర్చులు తగ్గుతాయని చెప్పారు. అలాగే మామిడి పంటను క్షేత్ర సందర్శన చేశారు. మామిడి పూత దశలో ఉందని పలు రకాల పురుగు ఆశించే ప్రమాదం ఉందని ఏవో చెప్పారు. రైతులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అనంతరం ఆంధ్రప్రదేశ్ కమ్యూనిటీ నేచర్ ఫార్మింగ్ ఆధ్వర్యంలో ఘన, జీవామృతం తయారీపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ అధికారులు దుర్గా ప్రసాద్, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి వైబ్రెంట్ డైట్

అనకాపల్లి టౌన్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): స్థానిక డైట్ ఇంజనీరింగ్ కళాశాలలో ఈ నెల 6, 7 తేదీల్లో వైబ్రెంట్ డైట్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్.వైకుంఠరావు తెలిపారు. ఈ కార్యక్రమం తొలి రోజు ముఖ్య అతిథిగా వీఎస్ఈజెడ్ జాయింట్ డెవలప్‌మెంట్ కమిషనర్ రోషిణి అపరంజి కోరాటి, గౌరవ అతిథిగా ఐటీ గ్లోబల్ ఎంటర్‌ప్రైజ్ అప్లికేషన్స్ టెన్నికోమిచిగాన్, సీనియర్ వైస్ ప్రెసిడెంట్ శ్రీరామ్ పెంటకోట హాజరుకానున్నారని చెప్పారు. 7వ తేదీన నేవీ విభాగం ప్రతినిధులు హాజరవుతారని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు, ఆటల పోటీలు ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

▸▸ ఐద్వా జిల్లా అధ్యక్షురాలు మాణిక్యం

పరవాడ, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఐద్వా జిల్లా అధ్యక్షురాలు పి.మాణిక్యం సూచించారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు మంగళవారం ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో ఆమె మాట్లాడారు. వ్యసనాలతో జీవితం అంధకారమవుతుందన్నారు. మొబైల్ వినియోగం తగ్గించాలన్నారు. ఈ సదస్సులో ప్రిన్సిపాల్ జీవీ నారాయణరావు, అధ్యాపకురాలు లక్ష్మి, ఇతర అధ్యాపక సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సత్యనారాయణపురం పీహెచ్‌సీ భవనం పూర్తిచేయాలి

కొత్తూరు, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): అనకాపల్లి మండలంలోని సత్యనారాయణపురం పంచాయతీ మూలపేటలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం భవన నిర్మాణం పూర్తిచేసి అందుబాటులోకి తీసుకురావాలని బహుజన్ సమాజ్ పార్టీ నేత సూదికొండ మాణిక్యాలరావు డిమాండ్ చేశారు. నిర్మాణంలో ఉన్న ఈ భవనాన్ని మంగళవారం ఆయన పరిశీలించారు. గత ప్రభుత్వ హయాంలో నిర్మాణం ప్రారంభించినా నేటికీ పూర్తి కాకపోవడం బాధాకరమని ఈ సందర్భంగా ఆయన వాపోయారు. దీంతో వైద్య సేవలు అందక ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కూటమి ప్రజాప్రతినిధులు, అధికారులు ఈ సమస్యపై తక్షణమే దృష్టిసారించి పరిష్కరించాలని కోరారు.

లేబర్ కోడ్‌లకు వ్యతిరేకంగా నిరసన

అనకాపల్లి టౌన్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): కార్మికులకు నష్టం కలిగించే లేబర్ కోడ్‌లకు వ్యతిరేకంగా బుధవారం నిర్వహించనున్న నిరసన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఆర్.శంకరరావు పిలుపునిచ్చారు. దేశవ్యాప్త ఆందోళనలో భాగంగా ఉదయం పది గంటలకు నెహ్రూచౌక్‌లో నిరసన తెలుపుతామని చెప్పారు.

వసతిగృహ విద్యార్థులకు దుస్తుల పంపిణీ

అనకాపల్లి టౌన్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి) : స్థానిక గాంధీనగరం ఎస్సీ ఇంటర్ విద్యార్థుల వసతిగృహంలో మంగళవారం అంతర్జాతీయ మానవత్వ దినోత్సవం సిద్ధార్థ సోషల్ సర్వీస్ అండ్ కల్చరల్ అసోసియేషన్ అధ్యక్షుడు బల్లా నాగభూషణం ఆధ్వర్యంలో జరిగింది. ఈ సందర్భంగా 35 మంది విద్యార్థులకు దుస్తులను ఆయన అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ మానవతా దృక్పథంతో వ్యవహరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వసతిగృహ వార్డెన్ బీహెచ్. రామయ్య, అసోసియేషన్ ప్రతినిధులు వినకోట నీలేష్‌గుప్తా, పట్నాల కృష్ణమోహన్, రొబ్బి మల్లేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఆంజనేయస్వామి తీర్థ మహోత్సవాలు

పరవాడ, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): రథసప్తమి పురస్కరించుకుని మండలంలోని పి.బోనంగి, హనుమాన్ నగర్‌కాలనీ, దేశపాత్రునిపాలెం శివారు సాయినగర్ కాలనీల్లో మంగళవారం తీర్థ మహోత్సలను ఘనంగా నిర్వహించారు. ముందుగా ఆంజనేయస్వామికి అభిషేకాలతో పాటు ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం తీర్థం సందర్భంగా ఆయా గ్రామాల్లో ఏర్పాటు చేసిన సాముగరిడీలు, చిడతలు, కోలాటం ప్రదర్శనలు అలరించాయి. రాత్రి పలు సాంస్కృతిక కార్యక్రమాలను ప్రదర్శించారు.

గవరపాలెంలో అన్నదాన కార్యక్రమం

అనకాపల్లి టౌన్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): గవరపాలెం నాగేంద్రస్వామి ఆలయం వద్ద మంగళవారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. నరిసా భాస్కర సంతోష్‌కుమార్, తేజస్విని దంపతులు, దొడ్డి సత్యనారాయణ పేదలకు ఆహార పొట్లాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ బొడ్డేడ రోషన్‌కుమార్, మద్దాల క్రాంతికుమార్, పీలా రమణారావు, కొణతాల శ్రీనివాసరావు, ఆడారి రామలింగస్వామి, కొణతాల వరహా పాల్గొన్నారు.

ఆరుగురు పేకాటరాయుళ్ల అరెస్టు

లంకెలపాలెం, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): కన్నూరు పంచాయతీ పరిధిలోని మడకపాలెం తోటల్లో మంగళవారం రాత్రి పేకాట శిబిరంపై డీఎస్పీ విష్ణుస్వరూప్ సిబ్బంది కలిసి దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో ఆరుగుర్ని అరెస్టు చేసి, రూ3.300 నగదు, ఆరు ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. దాడుల్లో ఎస్ఐ కృష్ణారావు, సిబ్బంది పాల్గొన్నారు.

క్రైం... crime news

రాంకీ సీఈటీపీలో అగ్నిప్రమాదం.. కార్మికుడికి గాయాలు


ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న కరణం ముత్యాలు

పరవాడ, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఫార్మా సిటీలో రాంకీ యాజమాన్యానికి చెందిన కామన్ ఎఫ్ల్యూయంట్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ (సీఈటీపీ)లో మంగళవారం సంభవించిన అగ్ని ప్రమాదంలో ఒక కార్మికుడు గాయపడ్డాడు. ఈ సంఘటనకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. శ్రీ సాయి ఫ్యాబ్రికేషన్ కంపెనీ ఆధ్వర్యంలో సీఈటీపీలోని ఎంఈఈ భవనం మొదటి అంతస్థులో వ్యాక్యూమ్ పంప్‌కు పైప్‌లైన్ పనులు చేపడుతున్నారు. ఇదే భవనం మూడో అంతస్థులో వెల్డింగ్ పనులు జరుగుతున్నాయి. ఈ క్రమంలో నిప్పు రవ్వలు పై నుంచి కింద కాలువలో ఉన్న ఎఫ్ల్యూయంట్‌పై పడడంతో ఒక్కసారిగా మంటలు లేచాయి. దీంతో మొదటి అంతస్థులో పైప్‌లైన్ పనులు చేస్తున్న కార్మికుడు కరణం ముత్యాలు ముఖం, కాళ్లు, చేతులకు కాలిన గాయాలు అయ్యాయి. వెంటనే గాజువాకలో ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం విశాఖలోని కార్పొరేట్ ఆస్పత్రికి పంపారు. ముత్యాలు స్వస్థలం సబ్బవరం మండలం పీతపాలెం గ్రామం. ఈ సంఘటనపై ఎస్ఐ కృష్ణారావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కాగా సీఈటీపీలో జరిగిన ప్రమాదంపై సమగ్ర జరిపించాలని, రాంకీ యాజమాన్యంపై క్రిమినల్ కేసు నమోదు చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ డిమాండ్ చేశారు.

జోలాపుట్టు జలాశయంలో బాలుడి మృతదేహం లభ్యం


హమిత్ మృతదేహం

ముంచంగిపుట్టు, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆంధ్రా-ఒడిశా సరిహద్దులో ఉన్న జోలాపుట్టు జలాశయంలో గల్లంతైన ఇద్దరిలో మంగళవారం ఓ బాలుడి మృతదేహం లభ్యమైంది. ఈ జలాశయంలో ఈ నెల 1న నాటు పడవ మునిగి ఇద్దరు బాలురు గల్లంతైన విషయం తెలిసిందే. నాలుగు రోజులుగా ఒడిశా సహాయక బృందాలు విస్తృతంగా గాలింపు చర్యలు చేపడుతున్నాయి. ఎట్టకేలకు మంగళవారం మధ్యాహ్నం జలాశయంలో నాటుపడవ మునిగిన ప్రదేశంలో అమిత్ హంతాల(15) మృతదేహాన్ని సహాయక బృందాలు గుర్తించాయి. బండరాళ్ల మధ్యలో ఇరుక్కొని ఉన్న ఈ మృతదేహాన్ని అతి కష్టమ్మీద బయటకు తీసుకువచ్చారు. బాలుడి మృతదేహాన్ని చూసిన కుటుంబ సభ్యులు, స్థానికులు విలపించారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించనున్నట్టు ఒడిశా డిప్యూటీ తహసీల్దార్ పూర్ణచంద్ర సాహు తెలిపారు. రెడ్‌క్రాస్ సంస్థ ద్వారా అమిత్ కుటుంబ సభ్యులకు రూ.20 వేలు సాయం అందించారు. మరో బాలుడు శివ ఆచూకీ కోసం గాలింపు చర్యలు కొనసాగిస్తున్నారు.

మూగబాలికపట్ల అసభ్యకరంగా ప్రవర్తించిన ముద్దాయికి మూడు నెలలు జైలు శిక్ష

అనకాపల్లి రూరల్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): మూగ బాలికపట్ల అసభ్యకరంగా ప్రవర్తించిన ముద్దాయికి మూడు నెలలు కఠిన కారాగార శిక్ష, రూ.30 వేలు జరిమానా విధిస్తూ విశాఖపట్నం పోక్సో కోర్టు న్యాయమూర్తి మంగళవారం తీర్పు చెప్పారని ఎస్పీ తుహిన్‌సిన్హా ఒక ప్రకటనలో తెలిపారు. పాయకరావుపేట మండలంలో ఒక గ్రామానికి చెందిన మలకా శామ్యూల్ 2018 మే నెలలో అదే గ్రామానికి చెందిన మూగ బాలికపట్ల అసభ్యకరంగా ప్రవర్తించాడు. దీనిపై బాలిక కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు అప్పట్లో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు. అనంతరం కోర్టులో చార్జిషీటు దాఖలు చేశారు. వాదోపవాదాల అనంతరం ముద్దాయి నేరం చేసినట్టు నిర్ధారణకు వచ్చిన న్యాయమూర్తి పై విధంగా తీర్పు చెప్పారు.

చికెన్ ధరలు

బ్యాగ్	రూ.లలో
రైతు ధర	100.00
లైవ్ ధర	120.00
విత్ స్కిన్	210.00
స్కిన్ లెస్	220.00

కోడి గుడ్లు (నెక్)

వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	470
విజయనగరం	474
శ్రీకాకుళం	474

కునుకు కరవాయె!

సగటు మనిషిని పీడిస్తున్న నిద్రలేమి

- అధిక సెల్‌ఫోన్ వినియోగం, పని ఒత్తిడే కారణం
- ప్రతిరోజూ 8 గంటల నిద్ర అవసరం
- లేదంటే అనేక అనారోగ్య సమస్యలు చుట్టుముట్టే ప్రమాదం
- గుండె, నరాలు, మెదడుపై తీవ్ర ప్రభావం
- యువతలో అధికమవుతున్న స్లీప్ డిజార్డర్



(విశాఖపట్నం- ఆంధ్రజ్యోతి)

నిద్ర సరిగా పట్టడంలేదనే మాట ఇటీవల చాలామంది నుంచి వినిపిస్తోంది. ముఖ్యంగా నగర వాసుల్లో ఈ పరిస్థితి మరింత ఎక్కువగా కనిపిస్తోంది. సుమారు 47 శాతం మంది ప్రజలు నిద్రలేమితో బాధపడుతున్నట్టు సర్వేల్లో తేలింది. పన్నెండు శాతం మంది చాలా ప్రమాదకరమైన నిద్రలేమితో బాధపడుతున్నట్టు గణాంకాలు తేలింది. నిద్రలేమితో తలనొప్పి, అలసట, ఇరిటేషన్, ఏకాగ్రత కోల్పోవడం వంటి లక్షణాలు కనిపిస్తున్నాయని తేలినట్టు నిపుణులు పేర్కొంటున్నారు. జాతీయ రహదారులపై జరిగే ప్రమాదాలకు 40 శాతం నిద్రలేమి కారణమని ఓ నివేదిక స్పష్టం చేసింది.

ఆనందకరమైన జీవనానికి సుఖ నిద్ర అవసరం. గాఢ నిద్రతో పాటు ఎంతసేపు నిరంతరాయంగా పడుకున్నారనేది ఆధారపడి ఉంటుందని వైద్య నిపుణులు చెపుతున్నారు. నగరాల్లో నిద్రలేమి సమస్యపై హైదరాబాద్‌లోని ఏఐజీ సంస్థ ఇటీవల ఓ సర్వే నిర్వహించింది. ఇందులో ఆశ్చర్యకరమైన నిజాలు వెలుగు చూశాయి. తీవ్రమైన నిద్రలేమితో గుండె బలహీనమవడం, నరాలు పటుత్వం కోల్పోవడం, జ్ఞాపకశక్తి తగ్గిపోవడం, అధిక బరువు వంటి సమస్యలు తలెత్తుతాయని అంటున్నారు. ఈ నేపథ్యంలో నిద్రలేమి నుంచి ఎంత తొందరగా బయటపడితే ఆరోగ్యానికి అంత మంచిదని సూచిస్తున్నారు.

ఎందుకీ సమస్య

ప్రస్తుత కాలంలో అధికశాతం యువత గాడ్జెట్‌లతోనే గడుపుతున్నారు. రాత్రి పన్నెండు గంటల వరకు అతి సాధారణం కాగా కొందరు ఒంటి గంట, రెండు గంటల వరకూ ఫోన్‌లతోనే కాలక్షేపం చేస్తున్నారు. ఎంత పని చేసుకుని వచ్చినా, నిద్రకు ఉపక్రమించేటప్పుడు సెల్‌ఫోన్ చూడడం చాలా మందికి దినచర్యగా మారింది. సోషల్ మీడియాలో ఒకదాని తర్వాత ఒకటి రావడం, ప్రపంచమే మన చేతిలో ఇమిడిపోయినట్టుగా అనిపించడంతో దానికి బానిసలవుతున్నారు. దీంతో ఫోన్ పక్కన పెట్టి నిద్రకు ఉపక్రమించాలన్న ధ్యాస లేకుండా పోతోంది. ఫలితంగా నిద్రలేమి సమస్య వెంటాడుతోంది. కొంతకాలం కిందటి వరకు సినిమా చూడాలంటే థియేటర్లకు వెళ్లాల్సి వచ్చేంది. కానీ ఇప్పుడు కొత్త సినిమా విడుదలైన రోజే సెల్‌ఫోన్‌లో ప్రత్యక్షమవుతోంది. మరోపక్క ఓటీటీల్లో వివిధ సినిమాలు, వెబ్ సిరీస్‌లు, ఆన్‌లైన్‌లో పైరసీ సినిమాలు అందుబాటులోకి వచ్చాయి. దీంతో యువత సోషల్ మీడియాతో పాటు సినిమాలు, వెబ్ సిరీస్‌లను చూడడాన్ని వ్యసనంగా మార్చుకుంది. మరో పక్క ఉద్యోగపరమైన ఒత్తిడి, ఆర్థిక, కుటుంబ సమస్యలు చుట్టుముట్టి సుఖ నిద్రకు దూరం చేస్తున్నాయి.





ఏం చేయాలి

నిద్ర మనిషి శారీరక, మానసిక ఆరోగ్యానికి దివ్యౌషధం. ఎంత పని ఒత్తిడిలో ఉన్నా, నిర్దిష్ట నిద్ర సమయాన్ని కేటాయించుకోవడం చాలా అవసరం. మనల్ని మనం నియంత్రించుకోగలిగితే నిద్రను ఆహ్వానించవచ్చు. ఎన్ని సమస్యలున్నా నిద్ర తర్వాతే అన్న ఆలోచన అవసరం. ఇందుకు యోగా, మెడిటేషన్ ఉపయోగపడతాయి. ఎట్టి పరిస్థితుల్లోనూ మత్తు కలిగించే మాత్రలు, పదార్థాలకు అలవాటు పడకూడదు. నెమ్మదిగా వంద అంకెలను ఏకాగ్రతతో లెక్కపెడితే నిద్ర వచ్చే అవకాశాలు చాలా ఎక్కువని నిపుణులు సూచిస్తున్నారు. మనసులోకి ఎలాంటి ఆలోచనలు రాకుండా చూసుకోవడం నిద్రకు ఉత్తమమైన మార్గం. ముఖ్యంగా రాత్రి తొమ్మిది లేదా పది గంటల తర్వాత ఫోన్ జోలికి వెళ్లకపోవడం, ఇంట్లో ఒక్కరి ఫోన్ మాత్రమే ఆన్‌లో ఉంచుకుని, మిగిలినవి సైలెంట్‌లో పెట్టుకుంటే సమస్య చాలా వరకూ పరిష్కారం అవుతుంది. మరీ ముఖ్యమైన ఫోన్ కాల్ అయితే ఇంట్లో వారి నంబరు అవతలి వారి వద్ద ఉండేలా చూసుకోవాలి. సెలవుల్లో తప్ప ఆన్‌లైన్ సినిమాలు, వెబ్ సిరీస్‌ల జోలికి వెళ్లకుండా ఉండడం ఉత్తమం. నిద్రలో మెలకువ వచ్చిన ప్రతిసారీ సెల్ చూడడం మానుకోవాలి. లేదా నోటిఫికేషన్ వచ్చిన ప్రతిసారీ సెల్ తీస్తే ఇక అంతేసంగతి.

ఇవీ సమస్యలు

కంటి నిండా నిద్ర కరవైతే ఆరోగ్య సమస్యలు చుట్టుముడతాయి. మనిషికి గాలి, నీరు, ఆహారం ఎంత అవసరమో, నిద్ర కూడా అంతే అవసరం. రోజులో కనీసం ఎనిమిది గంటల నిద్ర ఉండాలి. రోజూ ఒకే సమయంలో నిద్రపోయేలా అలవాటు చేసుకోవాలి. స్లీప్ డిజార్డర్స్ అనే అంశంపై చేసిన సర్వేలో నగరంలో 60 శాతం మంది సరైన నిద్ర లేక ఇబ్బందులు పడుతున్నట్లు తేలింది. రాత్రి నిద్ర సరిగా లేకపోతే పగలు బద్ధకంగా, నీరసంగా అనిపించడం సాధారణం. అలసట, అసహనం, డ్రైవింగ్‌లో నిద్ర రావడం, తలనొప్పి, ఆలోచించలేకపోవడం, సరిగా వినలేకపోవడం, సరైన నిర్ణయాలు తీసుకోలేకపోవడం, చేసే పనిలో తప్పులు దొర్లడం, అధిక రక్తపోటు ప్రాథమికంగా కనిపించే లక్షణాలు. నిద్రలేమి కొనసాగితే తీవ్ర అనారోగ్యం దరిచేరి, ప్రాణాంతకంగా మారే ప్రమాదం ఉంది. ముఖ్యంగా గాఢ నిద్ర చాలా అవసరం. లేదంటే గుండె, నరాలు, జ్ఞాపకశక్తి, అధిక బరువు వంటి సమస్యలు తలెత్తుతాయి. అంతే కాదు మానసిక సమస్యలు చుట్టుముట్టే ప్రమాదముందని హెచ్చరిస్తున్నారు.

ఉపమాక వెంకన్న కల్యాణోత్సవాలను ఘనంగా నిర్వహించాలి

- భక్తులకు అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు
- హోం మంత్రి అనిత


ఉపమాక వెంకన్న కల్యాణోత్సవ ఏర్పాట్లపై మాట్లాడుతున్న హోం మంత్రి అనిత

నక్కపల్లి, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): ఉపమాక క్షేత్రంలో వచ్చే నెలలో జరగనున్న వేంకటేశ్వరస్వామి వారి వార్షిక కల్యాణోత్సవాలను ఘనంగా నిర్వహించాలని, భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేయాలని హోం మంత్రి వంగలపూడి అనిత, ఆలయ అధికారులను ఆదేశించారు. ఉపమాక ఆలయంలో మార్చి 10వ తేదీ నుంచి స్వామివారి కల్యాణోత్సవాలు జరగనున్న నేపథ్యంలో మంగళవారం మధ్యాహ్నం ఆమె సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, వైసీపీ పాలనలో ఉపమాక దేవస్థానం అభివృద్ధి మందగించిందని, ఈసారి కల్యాణోత్సవాల్లో కూటమి ప్రభుత్వ ముద్ర కనిపించాలని అన్నారు. ఈ సందర్భంగా ఆలయ మాజీ చైర్మన్ కొప్పిశెట్టి బుజ్జి, జడ్పీ మాజీ కో-ఆప్షన్ సభ్యుడు కొప్పిశెట్టి కొండబాబు మాట్లాడుతూ, భక్తులు పుణ్యస్నానాలు ఆచరించే స్వామివారి పుష్కరిణి అధ్వాన్నంగా వుందని, స్వామివారి కల్యాణోత్సవాలకు దాతలను భాగస్వాములను చేస్తే బాగుంటుందని అన్నారు. స్వామివారి వార్షిక కల్యాణోత్సవాల వివరాలను ఆలయ ప్రధానార్చకులు ప్రసాదాచార్యులు తెలియ పరిచారు. ఏటా కల్యాణోత్సవం రోజున మాత్రమే స్వామివారికి పసిడి ఆభరణాలను అలంకరిస్తారని, ఈసారి ఐదు రోజులపాటు బంగారు ఆభరణాలను అలంకరించాలని, తిరు మల లడ్డూ ప్రసాదాలను ఉపమాక ఆలయంలో విక్రయిం చేలా చూడాలని కొప్పిశెట్టి బుజ్జి కోరారు. ఆలయంలో అర్చకుల కొరత, ఇతర సమస్యల గురించి అర్చకులు వివరించారు. అనంతరం అనిత టీటీడీ ఉన్నతాధికారులకు ఫోన్ చేసి మాట్లాడారు. స్వామివారి కల్యాణోత్సవాల నేపథ్యంలో పుష్కరిణిని బాగు చేయాలని కోరారు. పది రోజుల్లో తిరుమల వెళ్లి అధికారులతో మాట్లాడతానని ఆమె చెప్పారు. అంతకుముందు ఆలయానికి వచ్చిన ఆమెకు అధికారులు, అర్చకులు స్వాగతం పలికారు. స్వామివారిని దర్శించుకున్న అనంతరం గోత్రనామాలతో అర్చకులు పూజలు నిర్వహించారు. శేషవస్త్రంతో సత్కరించి, వేద ఆశీర్వచనం చేశారు. కూటమి నాయకులు గెడ్డం బుజ్జి, కొప్పిశెట్టి వెంకటేశ్, పెదిరెడ్డి చిట్టిబాబు, పెంకులరాజు, కొప్పిశెట్టి జగదీశ్వరరావు, కురందాసు నూకరాజు, దేవర సత్యనారాయణ, సర్పంచ్ ప్రగడ వీరబాబు, వెలగా శ్రీనివాసరావు, కోసూరి శ్రీనివాసరావు, మీగడ సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

రఘువర్మకే కూటమి మద్దతు

- ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవిరావు
- గత పాలకుల నిర్లక్ష్యంతో గాడి తప్పిన విద్యా వ్యవస్థ: రఘువర్మ


నామినేషన్ దాఖలు చేసేందుకు భారీ ర్యాలీగా వెళ్తున్న ఎమ్మెల్సీ రఘువర్మ

విశాఖపట్నం, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ప్రస్తుత ఎమ్మెల్సీ పాలకపాటి రఘువర్మకు కూటమి పార్టీలు మద్దతు ఇస్తున్నాయని, ఈ మేరకు త్వరలో ప్రకటన వెలువడుతుందని ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవిరావు పేర్కొన్నారు. ఎమ్మెల్సీగా పోటీ చేస్తున్న రఘువర్మ నామినేషన్ దాఖలు కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తున్న రఘువర్మను మరోసారి గెలిపించాలని పిలుపునిచ్చారు. విశాఖ కలెక్టరేట్‌లో కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్‌కు నామినేషన్ పత్రాలను సమర్పించిన అనంతరం ఎమ్మెల్సీ రఘువర్మ మాట్లాడుతూ వైసీపీ పాలకుల నిర్లక్ష్యంతోనే విద్యావ్యవస్థ గాడి తప్పిందని ఆరోపించారు. తాను మళ్లీ ఎన్నికైతే విద్యావ్యవస్థను చక్కదిద్దుతానన్నారు. నామినేషన్ దాఖలు కార్యక్రమానికి ఆరు జిల్లాల నుంచి ఉపాధ్యాయులు, అధ్యాపకులు, అభిమానులు భారీగా తరలిరావడం గొప్ప విజయమన్నారు. ఉపాధ్యాయ సమస్యలతోపాటు ఇతర సమస్యలు పరిష్కరిస్తానన్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థను మరింత బలోపేతం చేయడానికి తనకు మరో అవకాశం ఇవ్వాలని కోరారు. అంతకుముందు జీవీఎంసీ గాంధీ విగ్రహం నుంచి కలెక్టరేట్ వరకు ఊరేగింపు నిర్వహించారు. నామినేషన్ దాఖలు అనంతరం దండుబజార్‌లోని ప్రైవేటు ఫంక్షన్‌హాల్లో సమావేశం నిర్వహించిన నాయకులు రఘువర్మను గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షురాలు చెన్నుపాటి మంజుల, కార్యదర్శి భానుమూర్తి, ఆరు జిల్లాల నాయకులు, టీచర్లు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో బంగ్లాదేశ్ విద్యార్థిని మృతి


శషోతినాగ్ (ఫైల్ ఫొటో)

విశాఖపట్నం, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): విశాఖ నగరంలోని త్రీటౌన్ పోలీస్ స్టేషన్ సమీపంలో సోమవారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో బంగ్లాదేశ్‌కు చెందిన శషోతినాగ్ (19) మృతిచెందింది. శషోతినాగ్ ఆంధ్ర విశ్వవిద్యాలయంలో బి.ఫార్మసీ మొదటి సంవత్సరం చదువుతోంది. ఎం.వి.పి.కాలనీ సెక్టార్-10లో గల ఫారిన్ స్టూడెంట్స్ హాస్టల్‌లో ఉంటోంది. సోమవారం వసంత పంచమిని పురస్కరించుకుని వర్సిటీలో చదువుకుంటున్న వంద మంది బంగ్లాదేశ్ విద్యార్థులు ఏయూ ప్లాటినం జూబ్లీహాలులో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఆ కార్యక్రమం ముగిసిన తర్వాత ఏయూలోనే బి.ఫార్మసీ మూడో సంవత్సరం చదువుతున్న బంగ్లాదేశ్‌కు చెందిన రేవన్‌దాస్ ద్విచక్ర వాహనంపై చినవాల్తేరు మీదుగా ఎంవీపీ కాలనీలోని హాస్టల్‌కు బయలుదేరింది. రాత్రి 12 గంటల సమయంలో చినవాల్తేరు ప్రభుత్వ పాఠశాల వద్ద ఉన్న స్పీడ్ బ్రేకర్ దాటిన తర్వాత బైక్‌పై వెనుక కూర్చున్న శషోతినాగ్ జారి రోడ్డుపై పడిపోయింది. తలకు తీవ్రగాయం కావడంతో ఆమెను వెంటనే రామ్‌నగర్‌లోని కార్పొరేట్ ఆస్పత్రికి తరలించగా, చికిత్సపొందుతూ రాత్రి 1.30 గంటల సమయంలో మృతి చెందింది. దీనిపై త్రీటౌన్ పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతురాలి పిన్ని బంగ్లాదేశ్ పోలీస్ శాఖలో డీసీపీగా పనిచేస్తున్నట్టు పోలీసులు చెబుతున్నారు.

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానానికి ముగ్గురి నామినేషన్

... 5వ పేజీ తరువాయి

రిటర్నింగ్ అధికారి, జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిరప్రసాద్‌కు సమర్పించారు. రఘువర్మ వెంట ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవిరావు, ఏపీటీఎఫ్ మద్దతుదారులు ఉన్నారు. నామినేషన్ దాఖలకు అవసరమైన సాంకేతిక సహకారాన్ని సహాయ రిటర్నింగ్ అధికారి బీహెచ్ భవానీశంకర్, నోడల్ అధికారి దయానిధి, ఇతర సిబ్బంది అందించారు. నామినేషన్ పత్రాల దాఖలుకు అభ్యర్థితోపాటు మరో నలుగురిని మాత్రమే అనుమతించారు. ఈస్ట్ ఏసీపీ కె.లక్ష్మణమూర్తి ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

లక్కవరం వాసులను వీడిన టెన్షన్

- మహిళా రైతును హత్య చేసిన నిందితుడు పట్టుబడడంతో ఊపిరిపీల్చుకున్న జనం

చోడవరం, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని లక్కవరంలో గత నెల 9న సాయంత్రం పొలానికి వెళ్లిన మహిళా రైతు వబలరెడ్డి నరసమ్మను అతి దారుణంగా హతమార్చిన నిందితుడు ఎట్టకేలకు ఈ నెల 3వ తేదీన పట్టుబడడంతో గ్రామస్థులు ఊపిరిపీల్చుకున్నారు. నిందితుడు తమ గ్రామానికి చెందిన అల్లుడేనని తెలిసి విస్తుపోయారు. ఈ కేసులో పోలీసులు తీవ్రంగా శ్రమించి నిందితుడిని పట్టుకోగలిగారు. విజయనగరం జిల్లా కొత్తవలస ప్రాంతానికి చెందిన మాదాబత్తుల కృష్ణకు లక్కవరానికి చెందిన యువతితో వివాహమైంది. కొత్తవలస ప్రాంతంలో ఓ ప్రైవేటు కంపెనీలో పనిచేస్తున్న కృష్ణ సంక్రాంతి పండుగకు ముందు అత్తింటికి వచ్చినట్టు సమాచారం. ఆ పొరుగింట్లో ఉండే మహిళా రైతు వబలరెడ్డి నరసమ్మ మెడలో బంగారంతో ఒంటరిగా పొలానికి వెళ్లి వస్తుండడం గమనించాడు. పక్కా ప్రణాళికతో ఆమెను అతి దారుణంగా హతమార్చి బంగారు నగలు కాజేశాడు. ఘటన జరిగిన నాటి నుంచి పోలీసులు సమీపంలోని సీసీ ఫుటేజీలు పరిశీలించడంతో పాటు ఇతర ప్రాంతాల నుంచి వచ్చి వెళ్లిన వారి గురించి ఆరా తీశారు. ఈ క్రమంలో కృష్ణ రాకపోకలు పోలీసులకు అనుమానం కలిగించాయని తెలిసింది. అతని గురించి విచారణ జరిపిన క్రమంలో అతనిపై గతంలో ఇదే తరహాలో కేసు నమోదై ఉండడంతో పోలీసుల అనుమానం బలపడింది. మూడు వారాలకు పైగా గాలించిన అనంతరం అతడిని అరెస్టు చేయడంతో గ్రామస్థులు ఊపిరిపీల్చుకున్నారు. మహిళా రైతులు ఉదయం నుంచి సాయంత్రం వరకు పొలాలకు వెళ్లి రావడం సహజమని, నిందితుడు పట్టుబడకపోతే వారి మెడలోని బంగారం కోసం మరిన్ని హత్యలు చేసేవాడేమోనని గ్రామస్థులు చర్చించుకుంటున్నారు.

ఫార్మా ఎక్స్‌పోకు ఆదరణ

- తరలివచ్చిన కంపెనీల ప్రతినిధులు, విద్యార్థులు


ఫార్మా ఎక్స్‌పోలో ఉపకరణాలను పరిశీలిస్తున్న సందర్శకులు

పరవాడ, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): ఫార్మాసిటీ క్రీడా మైదానంలో ఏర్పాటు చేసిన వైజాగ్ ఫార్మా అండ్ ల్యాబ్ ఎక్స్‌పో-2025లో ఏర్పాటు చేసిన వివిధ రకాల ఉపకరణాలు, పరికరాలను తిలకించడానికి ఔత్సాహికులు పెద్ద ఎత్తున వస్తున్నారు. రెండో రోజైన మంగళవారం ఎగ్జిబిషన్‌ను సందర్శించేందుకు విశాఖ, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు, విజయనగరం జిల్లాల నుంచి ఫార్మా కంపెనీల యాజమానులు, ప్రతినిధులు, ఉద్యోగులతోపాటు కెమికల్, మెకానికల్ ఇంజనీరింగ్, ఫార్మసీ, బీఎస్సీ విద్యార్థులు తరలి వచ్చారు. ఫార్మా, ఫార్మాయేతర ఉపకరణాల గురించి ఆయా సంస్థల ప్రతినిధులు వివరించారు. ఫార్మా రంగంలో వస్తున్న మార్పులు, అధునాతన సాంకేతిక పరిజ్ఞానం, తాజా ఆవిష్కరణల గురించి తెలియజేశారు. 150 సంస్థలకు చెందిన సుమారు రెండువేల ఫార్మా ఉపకరణాలను ప్రదర్శనలో ఉంచారు.

వైసీపీ అధినేతను కలిసిన జిల్లా నేతలు


వైసీపీ అధ్యక్షుడు జగన్మోహన్‌రెడ్డిని కలిసిన కరణం ధర్మశ్రీ, గుడివాడ అమర్‌నాథ్

అనకాపల్లి, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): అనకాపల్లి జిల్లాకు చెందిన పలువురు వైసీపీ నాయకులు మంగళవారం తాడేపల్లిలో పార్టీ అధినేత జగన్మోహన్‌రెడ్డిని కలిశారు. అనకాపల్లి పార్లమెంటరీ పార్టీ ఇన్‌చార్జి కరణం ధర్మశ్రీ, చోడవరం నియోజకవర్గ ఇన్‌చార్జి గుడివాడ అమర్‌నాథ్, తదితరులు జిల్లాలో పార్టీ పరిస్థితుల గురించి జగన్‌కు వివరించారు.

మరో ఫెర్రో పరిశ్రమ మూత?

... 5వ పేజీ తరువాయి

కర్మాగారంలో ఉన్న ఉత్పత్తులతోపాటు ముడిసరకును ఎలా తరలిస్తారంటూ కార్మికులు మండిపడుతున్నారు. బుధవారం ఉదయం నుంచి కర్మాగారం వద్ద భారీ ఎత్తున ఆందోళన చేస్తామని చెప్పారు.

అభిజిత్ బాటలోనే..

ప్రత్యేక ఆర్థిక మండలిలో అబిజిత్ ఫెర్రో అల్లాయిస్ కర్మాగారం గతంలోనే మూతపడింది. ఇప్పుడు రాజరాజేశ్వరి లలితా త్రిపుర సుందరి ఫెర్రో అల్లాయిస్ కూడా అదే బాటలో నడుస్తున్నది ఈ రెండు కర్మాగారాల యాజమాన్యాలు ఒక్కటే. విద్యుత్ బకాయిలు పేరుకుపోవడంతో అభిజిత్‌ను గత సెప్టెంబరులో మూసివేశారు. కార్మికులకు నోటీసులు ఇచ్చి బకాయి వేతనాలు చెల్లిస్తామని చెప్పారు. కానీ ఇంకా 25 శాతం జీతాలు చెల్లించాల్సి వుంది. తాజాగా రాజరాజేశ్వరి కర్మాగారాన్ని అనధికారికంగా మూసేశారు. పైగా కార్మికులకు ఎటువంటి నోటీసులు జారీ చేయలేదు.

పంచాయతీల్లో పారదర్శకత

... 5వ పేజీ తరువాయి

సంస్థల నుంచి వసూలు చేసేవారు. దీంతో పంచాయతీ పరిధిలో ఎంత పన్ను వసూలు కావాలి? ఆర్థిక సంవత్సరం ముగిసేనాటికి ఎంత పన్ను వసూలైంది? బకాయిలు ఎంత? అన్న సమాచారం వుండేది కాదు. దీనిని ఆసరాగా చేసుకుని కొంతమంది సిబ్బంది అవినీతికి పాల్పడడం, పంచాయతీ నిధులను సొంత అవసరాలకు వాడుకోవడం వంటివి చేస్తుంటారు. ఈ తరహా అక్రమాలు ఆలస్యంగా వెలుగుచూడడం, సంబంధిత ఉద్యోగులపై చర్యలు తీసుకోవడం పరిపాటిగా మారింది. ఈ నేపథ్యంలో పంచాయతీ ఆదాయ వనరుల్లో అవినీతి, అక్రమాలు, నిధుల దుర్వి నియోగాన్ని అరికట్టడానికి కూటమి ప్రభుత్వం దృష్టి సారించింది. ప్రజలకు పారదర్శకంగా సమాచారం అందించేందుకు ఆన్‌లైన్ సేవలను అందుబాటులోకి తెచ్చేందుకు సిద్ధమవుతున్నది. ఇందుగాను 'స్వర్ణ గ్రామ పంచాయతీ' వెబ్‌సైట్‌ను ప్రారంభించింది. పంచాయతీల ఆదాయ, వ్యయాలకు సంబంధించిన లావాదేవీలను 'స్వర్ణ పంచాయతీ' పేరిట ఆన్‌లైన్ ద్వారా నిర్వహించేలా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. దీంతో ఏ రోజుకారోజు పంచాయతీకి ఎంత ఆదాయం వచ్చింది, ఎంత ఖర్చు అయ్యింది అన్నది తెలుస్తుంది. రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ ఆదేశాల మేరకు నివాస గృహాలకు సంబంధించిన పన్నుల సమాచారాన్ని ఆయా కార్యదర్శులు సచివాలయాల సిబ్బంది సంబంధిత వెబ్‌సైట్‌లో నమోదు చేస్తున్నారు. 'స్వర్ణ పంచాయతీ' వెబ్‌సైట్‌లో ఇల్లు/ షాపు/ కంపెనీ/ పరిశ్రమ విస్తీర్ణం, హద్దులు, యాజమాని వివరాలు, ఏడాదికి ఎంత పన్ను చెల్లిస్తున్నారు వంటి వివరాలను నమోదు చేస్తారు. ఈ ప్రక్రియను త్వరితగతిన పూర్తిచేసి డిజిటల్ సేవలను అందుబాటులోకి తెచ్చేందుకు కృషి చేస్తున్నారు. 2025-26 ఆర్థిక సంవత్సరం నుంచి గ్రామపంచాయతీల్లో డిజిటల్ సేవలు అందుబాటులోకి వస్తాయని అధికారులు చెబుతున్నారు. పన్నుల చెల్లింపుతోపాటు పంచాయతీ ద్వారా జారీ అయ్యే వివిధ రకాల ధ్రువపత్రాలు, భవన నిర్మాణ అనుమతులు కూడా పొందవచ్చు.